ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 13, నవంబరు 2024

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

7

ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో క్రీడా వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న కేవీల్లో చదువుకుంటున్న విద్యార్థులు భారీగా తరలివచ్చారు. నిత్యం తరగతి గదులు, పుస్తకాలకే పరిమితమయ్యే వారు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది.



అవినీతి అధికారిపై వేటు

- డీఎల్‌డీవో బాధ్యతల నుంచి ఉషారాణి తొలగింపు
- కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో పనిచేసే ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పూర్వపు ఇన్‌చార్జి డీపీవో ఉషారాణిపై వేటుపడింది. ప్రస్తుతం ఒంగోలు డీఎల్‌డీవోగా ఉన్న ఆమెను బాధ్యతల నుంచి తొలగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా పంచాయతీ పరిధిలో పనిచేసే గ్రేడ్-5,6 (సచివాలయ) ఉద్యోగుల బదిలీల్లో 'తిరకాసు' చోటుచేసుకుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా, కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు వ్యతిరేకంగా అప్పుడు ఇన్‌చార్జి డీపీవోగా ఉన్న ఉషారాణి బదిలీలు చేశారు. దీని వెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారినట్లు ఆరోపణలు

మిగతా 6వ పేజీలో



వెలిగొండను పూర్తిచేయకపోతే ప్రజా ఉద్యమం

- మసిపూసి మారేడుకాయ చేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత కేటాయింపులు జీతభత్యాలు, పెండింగ్ బిల్లులకు సరిపోవు
- మార్చి బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించాలి
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

7

జిల్లాకు భారీ ప్రాజెక్టు

కనిగిరిలో తొలి బయో ఇంధన యూనిట్

- వచ్చే నెలలో శంకుస్థాపన
- మరో నాలుగు యూనిట్లు వచ్చే అవకాశం
- దొనకొండ కారిడార్‌కూ మంచి రోజులు
- అభివృద్ధిలో ప్రకాశం జిల్లాకు పెద్దపీట : లోకేష్
- వెలిగొండపై మాట నిలబెట్టుకున్నాం : చంద్రబాబు
- కృతజ్ఞతలు తెలిపిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు



సీఎం చంద్రబాబుతో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే జిల్లాకు భారీ ఊరట లభించింది. పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్ట్‌ను కేటాయించడంతోపాటు వివిధ సంస్థల ఏర్పాటులో ప్రకాశం జిల్లాకు పెద్దపీట వేస్తామని ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే వెలిగొండ విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని, బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించామని సీఎం చంద్రబాబు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా రిలయన్స్ బయో ఇంధన ప్రాజెక్ట్ తొలి యూనిట్‌ను కనిగిరిలో ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకోవడమేగాక వచ్చే నెలలోనే శంకుస్థాపన చేస్తామని సీఎం స్పష్టమైన ప్రకటన చేశారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాకు భారీ ప్రాజెక్టు వస్తోంది. ఈ మేరకు మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, లోకేష్‌లతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లాలో కూటమికి భారీ విజయం లభించడంతో అటు కేబినెట్, ఇటు కార్పొరేషన్ పదవుల్లోనూ ఇప్పటికే ప్రాధాన్యం ఇచ్చారు. తాజాగా రిలయన్స్ సంస్థ బయో ఇంధన ప్రాజెక్ట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. మూడు నెలల క్రితం లోకేష్ ముంబై వెళ్లి రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని కలిసొచ్చారు. మంగళవారం ప్రభుత్వంతో రిలయన్స్ సంస్థ బయో ఇంధన ప్రాజెక్ట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని ఒప్పందం చేసుకుంది.

కనిగిరిలో తొలి యూనిట్

రిలయన్స్ ఏర్పాటు చేసే బయో ఇంధన ప్రాజెక్ట్‌లో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎక్కువ యూనిట్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా కనిగిరిలో తొలి యూనిట్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. దీనికి వచ్చేనెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు లోకేష్ మంగళవారం ప్రకటించారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు 1,200 ఎకరాలు

మిగతా 6వ పేజీలో



పందిళ్లపల్లిలో సమావేశమైన యువత

నాడు భగభగ.. నేడు ధగధగ

రక్తపుటేరులు పారిన పందిళ్లపల్లెలో చైతన్య పవనాలు

- తొలుత విద్యాభివృద్ధితో గ్రామ రూపురేఖలు మార్పు
- పెద్దల ఫ్యాక్షనిజాన్ని తరిమికొట్టిన నేటి తరం
- అందరూ ఏకమై పాఠశాలల అభివృద్ధికి రూ.90లక్షలు వసూలు
- సేవా కార్యక్రమాల నిర్వహణ

7



లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు చేయండి
- కలెక్టర్ అన్సారియా ఆదేశం
- కొత్తగా ఏడు స్కానింగ్ సెంటర్లకు అనుమతి

6



ఒంగోలులో కురుస్తున్న వర్షం

తూర్పున మోస్తరు.. పశ్చిమాన జల్లులు

- జిల్లావ్యాప్తంగా వాన
- మరో రెండు రోజులు వర్ష సూచన
- మరింత ఊపందుకోనున్న రబీ సాగు

ఒంగోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాతావరణం మారింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి జల్లులు పడుతున్నాయి. తూర్పుప్రాంతంలో ఒకమోస్తరు వాన కురిసింది. మంగళవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో జరుగుమల్లి మండలంలో 16.4మి.మీ, సింగరాయకొండలో 16.0మి.మీ, ఒంగోలులో 12.8మి.మీ, కొత్తపట్నంలో 10.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒంగోలులో ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒక మోస్తరు వాన కురిసింది. పలుచోట్ల రోడ్లపై నీరు పారింది. సాయంత్రం వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురవగా, పశ్చిమప్రాంతంలో జల్లులు పడ్డాయి. ఇవి సాగుకు ఉపయుక్తం కానున్నాయి. ఖరీఫ్‌లో వేసిన పైర్లలో దాదాపు లక్షన్నర హెక్టార్లలో పంటలు పొలంలో ఉన్నాయి. ప్రస్తుత రబీలో సుమారు 33 వేల హెక్టార్లలో పైర్లు వేశారు. వీటన్నింటికీ తాజా వర్షాలు మేలు చేయనున్నాయి. అంతేకాక మరో రెండు రోజులపాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అలా ఒక మోస్తరు వర్షం కురిస్తే జిల్లాలో రబీ సాగు మరింత ఊపందుకోనుంది. ప్రత్యేకించి పొగాకు, శనగ విస్తారంగా సాగయ్యే అవకాశం ఉంది.



హోరాహోరీగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నేడు సెమీఫైనల్స్, ఫైనల్స్

6

ఒంగోలులో ఎయిర్‌పోర్టుపై అధ్యయనం

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి వెల్లడి

6

ఎస్సీ మహిళలకు వడ్డీ లేని రుణాలు

- పొదుపు గ్రూపుల్లోని సభ్యులకు మంజూరు
- ఉన్నతి పథకం ద్వారా ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కొక్కరికి రూ.50 వేల సబ్సిడీ
- ఆ మొత్తం పీఎం అజయ్ పథకం కింద విడుదల
- లబ్ధిదారుల ఎంపికలో అధికారుల జాప్యం



ఒంగోలు నగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల్లోని ఎస్సీ మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఉన్నతి పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీని కింద రూ.లక్షకుపైన రుణం తీసుకొని స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.50వేలు సబ్సిడీ కూడా ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని ఎస్సీ మహిళల ఖాతాలకు నేరుగా కేంద్రమే జమచేయనుంది. ఉన్నతి పథకం కింద వడ్డీలేని రుణం తీసుకున్న వారు దాన్ని పూర్తిగా తీర్చిన తర్వాతనే కేంద్రం ఇచ్చే సబ్సిడీ బ్యాక్ ఎండ్ విధానంలో అందుతుంది. ఈ పథకం కింద జిల్లాలోని 109 మంది ఎస్సీ మహిళలకు లబ్ధిచేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరికి ముందుగా వెలుగు ద్వారా ఉన్నతి పథకం కింద రుణాలు మంజూరు చేసి ఆ వివరాలను ఎస్సీ కార్పొరేషన్‌కు అందజేస్తారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పీఎం అజయ్ పథకం కింద సబ్సిడీని చెల్లిస్తారు. ఉన్నతి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలోని 38 మండలాల్లో 109 మంది మహిళలను గుర్తించాల్సి ఉండగా ఆ ప్రక్రియ ప్రారంభమే కాలేదు. ఈ విషయంలో డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని
పటిష్టంగా అమలు చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ(పీసీపీఎన్‌డిటి) చట్టం పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారిపై, చేయించుకున్న వారి మీద చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలను ఎన్‌జీవోల ప్రతినిధుల సమన్వయంతో అధికారులు ముమ్మరం చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్స్ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా లేదా లని తరచుగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లను నిబంధనల ప్రకారం రెన్యువల్ చేయించుకుంటున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. స్కానింగ్ సెంటర్స్ అనుమతుల్లో భాగంగా ఈ సమావేశంలో ఏడు కొత్తవి, రెండు రెన్యువల్ దరఖాస్తులను ఆమోదించగా, రెండు దరఖాస్తులను తిరస్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, డాక్టర్ నాగార్జున, సీఐ ప్రభాకర్, ఎన్‌జీవో సార్ఫ్ జిల్లా మేనేజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

చిత్రం చెప్పిన అర్థం



-ఒంగోలు, ఆంధ్రజ్యోతి

ఆకాశాన్ని చీల్చుకుంటూ వస్తున్న ఎర్రటి, నల్లని మబ్బులు...!
హోరుగాలితో జత కట్టి ప్రచండవేగంతో పయనిస్తున్న మేఘాలు...!

ఒంగోలు నగరంలో మంగళవారం సాయంత్రం సంధ్యా సమయాన ఆకాశం పలు వర్ణాలతో, పలు అందాలతో ప్రజలను కనువిందు చేసింది.

జిల్లాకు భారీ ప్రాజెక్ట్

(5వ పేజీ తరువాయి)

అవసరం. అందులో వీలైనంత మేరకు ప్రభుత్వ భూమిని సేకరిస్తారు. అవసరమైతే రైతుల భూములను కూడా తీసుకుంటారు. రైతుల నుంచి తీసుకున్న భూమికి ఏటా కౌలు కూడా వారే చెల్లిస్తారు. మోటార్ వాహనాలు వినియోగించే సీఎన్‌జీ గ్యాస్‌ను గడ్డి నుంచి ఉత్పత్తి చేస్తారు. ఆ తర్వాత వివిధ రకాలుగా వినియోగపడే గ్యాస్, విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే విధంగా ఆ యూనిట్‌ను నిర్వహిస్తారు. గడ్డి పంటసాగుకు రైతుల సహకారం కూడా అవసరం.ఈ యూనిట్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఇంటికొక ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు సేకరించిన భూములు ఖాళీగా ఉండటం, ఇతరత్రా భూములు సేకరించేందుకు రైతులు సహకరిస్తారని సీఎంకు ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి వివరించారు. తొలి యూనిట్‌ను కనిగిరి ప్రాంతంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

నాలుగు యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

కాగా మంగళవారం ఉదయం ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు లోకేష్‌ను కలవగా కనీసం నాలుగు యూనిట్లనైనా ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని, అందుకు అవసరమైన స్థలాలను చూడాలని లోకేష్ చెప్పారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్ ప్రస్తావన కూడా రావడంతో అక్కడ ఒక యూనిట్ ఏర్పాటుకు పరిశీలిద్దామని లోకేష్ చెప్పినట్లు తెలిసింది.పశ్చిమ ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉన్నందున ఆ ప్రాంతానికి ఎక్కువ యూనిట్లు ఇద్దామని చెప్పారు. పర్చూరు నియోజకవర్గంలో కూడా భూములు కేటాయిస్తామని ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి లోకేష్‌న కోరారు. ఒక యూనిట్ ఏర్పాటుకు 1,200 ఎకరాలు సరిపోయినా, గడ్డి సాగు తదితరాలకు కనీసం 30వేల ఎకరాలు అవసరమని రిలయన్స్ సంస్థ సూచించింది.

వెలిగొండపై వెనుకడుగు లేదు.. కొత్త జిల్లా ఏర్పాటు చేద్దాం

సీఎం చంద్రబాబును ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నేతలు కలిశారు. వెలిగొండ నిర్మాణానికి బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు '2022లో మీ పుట్టిన రోజున వెలిగొండపై హామీ ఇచ్చారని గుర్తుచేయగా.. గుర్తుంది, ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసింది తానేనని, ఈ దఫా ప్రారంభించేది కూడా తానే'నని చంద్రబాబు చెప్పారు. అనంతరం మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించగా చేద్దామని చంద్రబాబు అన్నట్లు తెలిసింది. ఉదయం లోకేష్‌ను, సాయంత్రం చంద్రబాబును కలిసిన వారిలో మంత్రులు రవికుమార్, స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఏలూరి సాంబశివరావు, అశోక్‌రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, నారాయణరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. అలాగే పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కూడా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి అధికారిపై వేటు

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి. ఈనేపథ్యంలో బదిలీల్లో అవినీతి, అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా సమగ్ర విచారణకు ఆదేశించారు. ఫారెస్టు సెటిల్మెంట్ అధికారి లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించారు. బదిలీల్లో అనేక అంశాలు వెలుగు చూశాయి. బదిలీల ఆర్డర్లు ఇచ్చేందుకు తన కార్యాలయ ఉద్యోగులను పావుగా వాడుకొని వారి ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. సచివాలయాల తనిఖీకి వెళ్లిన సమయంలో అక్కడ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతోపాటు వారిని మానసికంగా దెబ్బతీసే విధంగా వ్యవహరించినట్లు త్రిసభ్య కమిటీ విచారణలో బయటపడింది. ఆమేరకు నివేదికను విచారణాధికారి అయిన లోకేశ్వరరావు 15 రోజుల క్రితం కలెక్టర్‌కు సమర్పించారు. దాన్ని ఆమె పరిశీలించి పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపారు. ఉషారాణి వ్యవహరించిన తీరుతో 56 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేక గాలిలో ఉండాల్సిన విషయాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఉషారాణిని ఒంగోలు డీఎల్‌డీవో బాధ్యతల నుంచి తప్పిస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాడరేవుకు చెందిన వివాహిత అదృశ్యంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఆమె కన్పించం లేదని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

● రాష్ట్ర రీజనల్ కో ఆర్డినేటర్ రామకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథంతో పాటు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని రాష్ట్ర రీజనల్ కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలోని సమావేశపు హాలులో మంగళవారం ఏకేయూ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు మై భారత్ పోర్టల్‌పై అవగాహన కార్యక్రమం వైస్ చాన్స్‌లర్ డీవీఆర్. మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. వీసీ మూర్తి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ప్రస్తుతం 58 ఎన్ఎస్ఎస్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. నూతనంగా మంజూరు కావాలంటే వలంటీర్లను అధిక సంఖ్యలో గుర్తించి వారిని సమాజ సేవలో భాగస్వాములను చేయాలని చెప్పారు. ఏకేయూ పరిధిలో మొత్తం 230 వరకు గుర్తింపు పొందిన కళాశాలలు ఉండగా ప్రస్తుతం 58 యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. అధికారుల సహకారంతో యూనిట్లను గణనీయంగా పెంచాలని కోరారు. అనంతనం యూనివర్శిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, సీడీసీ డీన్ సోమశేఖర్, కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్, దివ్యతేజోమూర్తి, ప్రిన్సిపాల్ రాజమోహన్, నిర్మలామణి, హరినాథ్, అంచుల భారతీదేవి, పిల్లి వెంకటరావు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న ఆర్‌డీ రామకృష్ణ, వీసీ మూర్తి

సినీ నటి కస్తూరిని అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారిని కించపరిచేలా మాట్లాడిన సినీ నటి కస్తూరిని వెంటనే అరెస్టు చేయాలని ద్రావిడ దేశం కృష్ణారావు డిమాండ్ చేశారు. ద్రావిడదేశం ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు సమీపంలోని చెరువుకొమ్ముపాలెంలో తమిళనాడు మాజీముఖ్యమంత్రి కరుణానిధి ఇంటిని ఆయన తన కార్యకర్తలతో కలిసి సందర్శించారు. అనంతరం అక్కడ సినీ నటి కస్తూరి ఫొటోలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఇటీవల చెన్నైలోని ఓ బహిరంగ సభలో కస్తూరి మాట్లాడుతూ మాజీముఖ్యమంత్రి కరుణానిధి కుటుంబాన్ని కించపరుస్తూ మాట్లాడటమే కాకుండా తెలుగువారిని ఎగతాళి చేస్తూ మాట్లాడటం దుర్మార్గంగా ఉందన్నారు. ఆమెపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బంకా చిరంజీవి, గోపీకృష్ణ, రాజు, డాక్టర్ వెంకటేశ్వర్లు, రంగారావు, కొండలు, మిరియాల రాఘవ, పెళ్లూరు శేషారావు తదితరుల పాల్గొన్నారు.


కస్తూరి ఫొటోలను దహనం చేస్తున్న ప్రతినిధులు

ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా

ప్రైవేటు బస్ డ్రైవర్ మృతి

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : పడుకున్న ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా కావడంతో ప్రైవేటు బస్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల మండల పరిధలోని కీర్తివారి పాలెంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మసనం గోవిందు (40), రమణ దంపతులు. వీరికి 19, 18 వయస్సున్న ఇద్దరు కుమా రులున్నారు. ఇతను వ్యవసాయం చేసుకుంటూ, ప్రైవేటు స్కూల్ బస్‌కు డ్రైవర్‌గా ఉన్నాడు. ఇంటి ఆవరణలో టేబుల్ ఫ్యాన్ మంచం వద్ద పెట్టుకుని పడుకున్నాడు. ఫ్యాను వైరు మంచం కాళ్ల కిందపడింది. ఇనుప మంచం కావడంతో విద్యుత్ సరఫరా అయి కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని రోదించారు.

అద్దంకి నుంచి దూరమైన ఉపాధి కార్యాలయం

క్లస్టర్‌ను రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం

ఆ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు

జిల్లాలో 2 చోట్ల మాత్రమే ఏపీడీ కార్యాలయాలు

అద్దంకి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో రెగ్యులర్‌గా జరిగే ఉపాధి హామీ పథకం పనులు కూడా ఉన్నాయి. పర్యవేక్షణకు అధికారులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తరువాత జిల్లాలో బాపట్లతో పాటు చీరాల, అద్దంకి క్లస్టర్‌లు ఉన్నాయి. అయితే గత రెండున్నర సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వం అద్దంకిలో ఉన్న క్లస్టర్‌ను రద్దు చేసి మార్టూరు కేంద్రంగా ఉన్న చీరాల క్లస్టర్‌లో కలిపారు. దీంతో బాపట్ల జిల్లాలో రెండు క్లస్టర్‌లు మాత్రమే ఉన్నాయి. చీరాల క్లస్టర్ పరిధిలో అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలోని 13 మండలాలు ఉన్నాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాలలో కూలీల లభ్యత ఎక్కువగా ఉండడంతో ఉపాధి పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 80 కోట్ల రూపాయల ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు మంజూరు అయ్యాయి. ఆ పనులన్నీ ఉపాధి హామీ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. చీరాల క్లస్టర్‌కు రెగ్యులర్ ఏపీడీ కూడా లేరు. దీంతో ఏపీవోను ఇన్‌చార్జి ఏపీడీగా నియమించారు. వైసీపీ ప్రభుత్వం లో రద్దు చేసిన అద్దంకి క్లస్టర్‌ను తిరిగి పునరుద్ధరించడం ద్వారా అద్దంకి నియోజకవర్గం పరిధిలో జరిగే పనుల పర్యవేక్షణ సులువుగా మారే అవకాశం ఉంది. చీరాల, పర్చూరు నియోజకవర్గాల మండలాలు ఒక క్లస్టర్‌గా, అద్దంకి నియోజకవర్గంలోని మండలాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని, అదే సమయంలో రెగ్యులర్ ఏపీడీని నియమించాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి అద్దంకిలో క్లస్టర్ ఏర్పాటుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన సత్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో నెలకొన్న పలు రకాల సమస్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తీసుకెళ్ళారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి ఆయా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పలు అంశాలపై సత్య చర్చించారు.


కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న దామచర్ల సత్య

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి

● ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

నాగులుప్పలపాడు, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాల విద్యను బలోపేతం చేయాలని విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. నాగులుప్పలపాడు జడ్పీ హైస్కూలును మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థవంతంగా బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, అపార్ ఐడీకార్డుల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్కుల జాబితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


స్కూలును పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

నేడు వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ (కె) కాకినాడ వారి ఇంటర్ కాలేజీ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్, యూనివర్సిటీ టీం ఎంపిక మంగళవారం జరుగుతుందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు వివరాలను వెల్లడించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావులు తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతున్న అండర్-11 రాష్ట్ర స్థాయి బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజు మంగళవారం హోరా హోరీగా సాగాయి. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో క్రీడాకారులు గెలుపు కోసం తలపడ్డారు. నిర్వాహకులు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కృష్ణ, అకాడమీ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ మాట్లాడుతూ బుధవారం సెమీఫైనల్స్, ఫైనల్స్ విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. కాగా పోటీలను క్రీడాకారుల తల్లిదండ్రులను, క్రీడాభిమానులు వీక్షించారు.


తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు ఎయిర్ పోర్టుపై అధ్యయనం

● ఆర్అండ్‌బీశాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి వెల్లడి

ఒంగోలు, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ఒంగోలులో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు ఏర్పాటుపై ప్రభుత్వం అధ్యయనం చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా మరో ఆరు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు ఇటీవల కేంద్రం ప్రకటించిన విషయం విదితమే. తదనుగుణంగా ఆ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో కుప్పం, శ్రీకాకుళం, తుని, తాడేపల్లిగూడెం, ఒంగోలు, నాగార్జునసాగర్‌లు ఉన్నాయి. వాటిలో భూమి ఎక్కడెక్కడ అందుబాటులో ఎంతెంత ఉందో తొలుత తెలపాలని కేంద్రం కోరగా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదించారు. అందులో ఒంగోలులో 657 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఆయా ప్రాంతాలలో ఎయిర్ పోర్టుల ఏర్పాటుకు తొమ్మిది అంశాలపై ప్రాథమిక అధ్యయానికి కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు అథారిటీ చేయనుంది. అందుకోసం ఒక్కొక్క ఎయిర్‌పోర్టు కోసం రూ.37లక్షలు అవసరం కాగా మొత్తం ఆరు ఎయిర్‌పోర్టులకు కలిపి రూ.2.27కోట్లను విడుదల చేస్తున్నట్లు మంత్రి జనార్దన్‌రెడ్డి మంగళవారం రాత్రి అమరావతిలో ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉండగా ప్రాథమిక అధ్యయన రిపోర్టులు ఆధారంగా కేంద్రం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

వెలిగొండకు నిధులపై సీఎంకు కృతజ్ఞతలు

వెలిగొండ ప్రాజెక్టుకు తాజా బడ్జెట్‌లో సుమారు రూ.400 కోట్లు కేటాయింపు పట్ల ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామిల నేతృత్వంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యేలు జనార్దన్, నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావు, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు తదితరులు సీఎం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పడిపోయిన పాత విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం



మార్టూరు, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని జొన్నతాళి గ్రామంలో మంగళవారం ఉదయం శిథిలమైన విద్యుత్ స్తంభం రోడ్డుపై విరిగి పడిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. వాస్తవంగా శిథిల స్తంభం పడిపోయిన సమీపంలో రోడ్డు పక్కన అరుగులపై రోజు జనం పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటుంటారు. అంతేకాకుండా రోడ్డుపైన అడపాదడపా తిరుగుతూనే ఉంటారు. అయితే ఉదయం కరెంట్ స్తంభం విరిగి పడిన సమయంలో అరుగులమీద కానీ, రోడ్డుమీద కానీ జనం ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామానికి చెందిన శానంపూడి చైతన్య అనే యువకుడు ఈ విషయాన్ని మార్టూరు విద్యుత్ శాఖ ఏడీఏ సురేంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాడు. గతంలో కూడా సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ గ్రామంలోని శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని పలు సార్లు విద్యుత్ అధికారులను కోరారు. సాయంత్రానికి విద్యుత్ అధికారులు స్పందించి గ్రామస్థుల సహకారంతో పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఆ గ్రామంలో ఒకప్పుడు ప్రత్యర్థి కని పిస్తే చాలు చంపేయండ్రా అంటూ కేకలు ప్రతిధ్వనించేవి. ఒంటరిగా కాలు కదపా లంటే భయం. చీకటి పడిందంటే గుంపులు గుంపులుగా వెళ్లాల్సిందే.. ఒకవేళ తప్పనిసరై బయటకు వెళ్తే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారో, రారో అని ఆందోళన. తోడు లేకుండా పొలం వెళ్లాలంటే చావును కొని తెచ్చుకున్నట్లేనని భయం వెంటాడుతుండేది. ఈ క్రమంలో హత్యకు ప్రతి హత్యలు జరిగాయి.

నడిరోడ్డుపై ఒకరిని.. బత్తాయి చెట్లకు నీరుపెట్టేందుకు వెళ్లిన మరొకరిని.. ఊరు బయటకు వెళ్లిన ఇంకొకరిని.. పెట్రోల్‌తో కాల్చి వేరొకరిని మాటు వేసి మట్టుబెట్టేవారు..! వరుస హత్య లతో కరుడు గట్టిన ఫ్యాక్షనిజం గ్రామంగా జిల్లాలోనే చరిత్రకెక్కిన బేస్తవారపేట మండలం పందిళ్లపల్లె పోలీసు రికార్డులోకి ఎక్కింది.

యువత ద్వారానే గ్రామాభివృద్ధి



పోలక వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్

మా గ్రామం యువత ద్వారానే అభివృద్ధి జరిగింది. గ్రామంలో పూర్వ విద్యార్థులు కలసి పెద్దలు పెంచుకున్న కక్షలను తరిమికొట్టి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదరణ లేదు. జిల్లా అధికారులు స్పందించి హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలి. పాఠశాల బస్సు నిర్వహణకు ఏటా రూ.3లక్షలు ఖర్చు చేస్తున్నాం. అందరం కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యం.

యువతతోనే ఫ్యాక్షనిజం అంతం



మార్తాల శ్రీనివాసరెడ్డి

ముందుగా మీబడి పిలుస్తోంది అనే వ్యాట్సప్ రూపకర్త గ్రామంలోని శ్రీనివాసరెడ్డి సెల్ ద్వారా ప్రారంభించారు.నేడు 187 మంది వ్యాట్సప్, 800 మంది ఫేస్‌బుక్ ద్వారా సోషల్ మీడియాలో సలహాలు, సూచనలు అందిస్తూ అభివృద్ధికి సహకరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. మోక్షగుండంలో ఒక పేద బీటెక్ విద్యార్థి క్యాన్సర్ బారినపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతుంటే మీబడి పిలుస్తోంది సోషల్ మీడియాలో అతని దీన గాథను పోస్ట్ చేస్తే పలు దేశాల నుంచి సుమారు రూ.25లక్షలు బ్యాంక్ అకౌంట్ జమకావడంతో అతని ప్రాణాలు కాపడగలిగారు. నిజంగా యువతకు అభినందనలు.



ఫ్యాక్షనిజం వదలి కలసికట్టుగా గ్రామస్థులు

నాడు భగభగ.. నేడు ధగధగ

పందిళ్లపల్లెలో దశాబ్దం నుంచి శాంతి కుసుమాలు విరబూస్తున్నాయి. రక్తపుటేరులు పారిన వీధుల్లో చైతన్యపవనాలు వీస్తున్నాయి. యువత చైతన్యం, స్ఫూర్తితో గ్రామం అచ్చమైన పల్లె అందాలను అద్దుకుంటోంది. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలలో ఉన్న వారందరినీ సుఫల్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో వాట్సప్ గ్రూపు ఏర్పాటుచేసి అందులో చేర్చారు. గతంలో హత్యకు గురైన కుటుంబాలు, బంధువులు, ప్రత్యర్థులు, గ్రామస్థులందరూ ఏకమై ఒకే మాటపై నిలిచారు. పిల్లల పుట్టిన రోజులు, పిల్లలకు ఉద్యోగాలు, పెళ్లి రోజు పేరుతో ఆ సొసైటికి చందాలు పంపడం ప్రారంభించారు. సుమారు ఇప్పటికి రూ. 90లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఒకే బాటతో స్ఫూర్తిదాయకంగా నిలిచి పందిళ్లపల్లె స్వరూపాన్నే మార్చేసిన ఆ గ్రామ యువతపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. -బేస్తవారపేట

కక్షలతో చితికిపోయిన ఆ గ్రామంలో నేడు

రక్తపుటేరులు పారిన పందిళ్లపల్లెలో చైతన్య పవనాలు

- తొలుత విద్యాభివృద్ధితో గ్రామ రూపురేఖలు మార్పు
- పెద్దల ఫ్యాక్షనిజాన్ని తరిమికొట్టిన నేటి తరం
- అందరూ ఏకమై పాఠశాలల అభివృద్ధికి రూ.90లక్షలు వసూలు
- సేవా కార్యక్రమాల నిర్వహణ

బేస్తవారపేట మండలం పందిళ్లపల్లె ఒకప్పుడు ఫాక్షన్ హత్యలతో అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. చివరకు గ్రామంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్‌కు పిల్లలను పంపాలన్నా తల్లిదండ్రులు భయపడి మాన్పించారు. ఈ దశలో పిల్లలు లేక హైస్కూల్‌ను రద్దు చేస్తున్నామని అధికారులు ప్రకటించారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే చివరకు ఎవరూ బతికి బట్టకట్టలేరని యువత ఆలోచించింది. వారందరూ ఏకమై ఫ్యాక్షనిజం అంతానికి నడుం బిగించారు. ముందుగా గ్రామంలో అభివృద్ధి పనులతో అందర్నీ మార్చాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలో రచ్చబండ వద్ద సమావేశమై హైస్కూల్, ఎంపీపీ స్కూల్‌ను కాపాడాలని తీర్మానించారు. ఆ మేరకు ఇరువర్గాల పెద్దలందరినీ ఒప్పించారు. ముందుగా మీ బడి పిలుస్తోంది అనే లోగోతో గ్రామ యువకులతో కలిసి వ్యాట్సప్ గ్రూప్, ఫేస్‌బుక్‌ను ఏర్పాటు చేశారు. అందులో విద్యార్థులు లేరని స్కూల్ ఎత్తివేస్తున్నారని, మనం చదివిన హైస్కూల్‌ను కాపాడాలంటే సౌకర్యాలు కల్పించి విద్యార్థుల రోల్ పెంచాలని చేసిన పోస్టుకు పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఇతర దేశాల్లో, ఉద్యోగాల్లో ఉన్న యువకులతోపాటు గ్రామంలో ఉన్న యువకులు కలసి సుఫల్ వెల్ఫేర్ సొసైటి ఏర్పాటు చేసి చందాలు సేకరించగా సుమారు రూ.కోటికి పైగా పోగయ్యాయి. ఆ నిధులతో హైస్కూల్ ఆట స్థలం అభివృద్ధి చేశారు. అదే సమయంలో గ్రామంలోకి బేస్తవారపేట నుంచి ప్రైవేట్ స్కూల్ బస్సులను నిషేధించారు. గ్రామంలో తిరిగి పిల్లలందర్నీ హైస్కూలోకే పంపేలా ఒప్పించారు. అంతేగాక హైస్కూల్‌కు ఒక ప్రైవేట్ బస్సును కొనుగోలు చేసి చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించి అక్కడి విద్యార్థులను కూడా ఒప్పించి రప్పించారు. ఉచితంగా రవాణా సౌకర్యం, యూనిఫాం, బూట్లు, బ్యాగులు, బుక్స్‌లు అందిస్తున్నారు. విద్యాబోధన చక్కగా సాగుతుండడంతో 20 మంది ఉన్న హైస్కూల్‌లో 130 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. స్వచ్ఛందంగా డిజిటల్ తరగతి గది, ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు.



విద్యార్థుల కోసం స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన బస్సు

● రూ.5లక్షలతో బస్సు ఏర్పాటు

యువత పోగు చేసిన సొమ్ము రూ.90లక్షలు కావడంతో అందులో రూ.5లక్షలతో ప్రయివేట్ బస్సు కొనుగోలు చేశాం. ప్రతి నెలా రూ.25వేలు బస్సు ఖర్చు కింద కేటాయించాం.

● సొసైటి తరఫున ఎంప్లాయిమెంట్ రిజిష్టర్ ఏర్పాటు

మీబడి పిలుస్తోంది స్ఫూర్తితో విద్యాభివృద్ధితోపాటు గ్రామాభివృద్ధిలో భాగం పంచుకోవాలనే ఉద్దేశంతో సుఫల్ వెల్ఫేర్ సొసైటి పవర్ బై మీబడి పిలుస్తోందిని ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ఎంప్లాయిమెంట్ రిజిష్టర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సంప్రాదాయ కళలపై ప్రత్యేక శిక్షణతోపాటు ఆపదలో ఉన్న 200 మందికి రక్తదానం చేశాం. 10వ తరగతిలో ప్రతిభ చూపిన వారి విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్నాం. ఏటా వేసవిలో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

● సంక్రాంతి వచ్చిందంటే సంబరాలే సంబరాలు

ఐదు దశాబ్దాలుగా గ్రామంలో సామూహికంగా పండుగలు జరుపుకున్న సందర్భాలు లేవు. అయితే యువత కలసి కట్టుగా గ్రామస్థులందరిని ఏకం చేయడంతో ఏటా సంక్రాంతి పండుగ రోజు గతంలో జరిగిన కక్షలు మరచి శ్రీరామాలయం వద్ద అందరూ కలసికట్టుగా ముచ్చటించుకోని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు.

వివిధ హోదాల్లో ఉండి గ్రామాభివృద్ధికి సహకారం

కర్నాటి రవీంద్రారెడ్డి తహసీల్దార్, మల్లెల శ్రీనివాసరెడ్డి చార్టర్ అకౌంట్, కొత్తకోట రాజశేఖర్ రైల్వే ఉద్యోగి, కర్రాటి వెంకటరెడ్డి బ్యాంక్ ఉద్యోగి, ఆవుల కోటేశ్వరరెడ్డి, మార్తాల జగదీశ్వరరెడ్డి ఆర్‌ఆర్‌బీ, ఉప్పులూరి చంద్రమౌళేశ్వరరెడ్డి ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్, పల్నాటి మహేశ్వరరెడ్డి లేబర్ ఆఫీసర్, మార్తాల వెంకటేశ్వరరెడ్డి లెక్చరర్, కర్నాటి సాయి కుమార్‌రెడ్డి ఎన్డీఏ, మండ్ల రంగస్వామి, పల్నాటి సందీప్‌రెడ్డి రైల్వే డ్రైవర్లు, పోలక బాలకృష్ణారెడ్డి, మండ్ల నెమిలిగుండం పోలీస్, ఆవుల మౌనిక, కర్నాటి తిరుపతిరెడ్డి టీచర్, రైల్వే ఉద్యోగాలు, పోస్టల్ ఉద్యోగాలు అనేక మందితో పాటు గ్రామంలోని మరో 10మంది ఉపాధ్యాయులు, 20మంది ఆర్మీలో పనిచేస్తున్న సైనికులు, 40 మంది సాఫ్ట్‌వేర్లు, ఇద్దరు గ్రూప్ 1 ఆఫీసర్స్, వివిధ ఉద్యోగాల్లో ఉన్న మరో 30 మంది, 20 మంది ఉద్యోగ విరమణ పొందిన వారందరు కలసి గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారు.



గ్రామంలోని సమస్యలను గుర్తిస్తున్న యువకులు

అట్టడుగు నుంచి.. అత్యున్నత స్థాయికి

- పశ్చిమ ప్రాంతం నుంచి తొలితరం ఐఏఎస్ దానం
- నేడు స్వగ్రామం పెద్దనల్లకాల్వలో తృతీయ వర్ధంతి
- ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే బీఎన్



ఒంగోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాధారణ దళిత కుటుంబం. అందునా సరైన విద్యా సౌకర్యాలు లేని జిల్లా పశ్చిమ ప్రాంతమైన కంభం మండలం పెద్దనల్లకాల్వలో పుట్టి చదువుల పట్ల ఉన్న ఆసక్తి ఆయనను అట్టడుగు నుంచి అత్యున్నత స్థాయికి చేర్చింది. ఉన్నత స్థాయి అధికారిగా ఏ స్థాయిలో ఎక్కడ పనిచేసినా ప్రభుత్వ పథకాలను పేద వర్గాలకు చేర్చడంలోను, అలాగే పేద వర్గాలు, దళితుల కోసం పనిచేసే వారికి తనవంతు సహకారం అందించడంలో ముందుండేవారు. తన నలుగురు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఇక తను పుట్టిన ఊరన్నా, ఆ ప్రాంత ప్రజలన్నా ఎంతో ప్రేమాభిమానాలు చూపేవారు.. ఆయనే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, దివంగత బొమ్మాజీ దానం. ఆయన పదో తరగతి వరకు సొంతూరైన పెద్దనల్లకాల్వ పొరుగున ఉన్న తురిమెళ్ల ప్రభుత్వ హైస్కూలులో చదివి దేశంలో అత్యున్నతమైన ఐఏఎస్ అధికారిగా సేవలు అందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడైన దానం తొలుత కాకినాడ జేఎన్‌టీయూలో అధ్యాపకునిగా ఉద్యోగజీవితం ప్రారంభించి అనంతరం సివిల్స్‌పై దృష్టి సారించారు. తొలుత ఐఎఫ్ఎస్, తర్వాత ఐపీఎస్ తదనంతరం 1971లో ఐఏఎస్ సాధించి ఆ ఉద్యోగంలో కొనసాగారు. తూర్పుగోదావరి జిల్లా జేసీగా, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్‌గా పనిచేసిన ఆయన పేదలకు భూములు, ఇళ్ల స్థలాల పంపిణీలో అగ్రస్థానంలో నిలిచి గవర్నర్ నుంచి అవార్డును సైతం అందుకున్నారు. ఎన్‌టీఆర్ సీఎం అయ్యాక దానంకు హౌసింగ్ శాఖ బాధ్యతలు అప్పగించగా ఎనిమిదేళ్లు ఆశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పథకాన్ని పరుగులు తీయించారు. చివరకు ఉమ్మడి రాష్ట్ర భూపరిపాలన కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూప కల్పనలో కీలకంగా పనిచేసిన దానం, దళిత క్రిస్టియన్ల రిజర్వేషన్ల కోసం పనిచేశారు. బొజ్జా తారకం, గద్దర్‌లతో సహ అనేక మందితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దానం తన నలుగురు పిల్లలను ఉన్నత విద్యావంతులను చేశారు. ఆయన పెద్ద కుమారుడైన బీఎన్ విజయకుమార్ ప్రస్తుతం సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ఉన్నారు. రెండో కుమారుడు కిషోర్, ఆయన సతీమణి కేశాంగ్‌లు ఇరువురు ఇన్‌కంట్యాక్స్ అధికారులు. మరో ఇద్దరు కుమారులు సునీల్, అనిల్‌లు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. 81వ ఏట 2021 నవంబరు 13న దానం మరణించగా స్వగ్రామ పట్ల ఆయనకు ఉన్న మక్కువను గౌరవించి అంత్యక్రియలను పెద్దనల్లకాల్వలో నిర్వహించారు. ఏటా వర్ధంతిని అక్కడే నిర్వహిస్తున్నారు. దానం మూడవ వర్ధంతి కార్యక్రమం బుధవారం పెద్దనల్లకాల్వలో జరగనుండగా ఎమ్మెల్యే విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వెలిగొండను పూర్తి చేయకుంటే ప్రజాఉద్యమమే

సీపీఎం నేత బీవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు

మార్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ప్రాంతం పశ్చిమ ప్రకాశానికి వరప్రసాదిని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హెచ్చరించారు. ఈ నెల 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రజాపోరుయాత్రలో భాగంగా మంగళవారం ఆ పార్టీ నాయకులు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ 1996లో నేటి, నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. మూడు దశాబ్దాలు కావస్తున్నా నేటికీ ఒక్క చుక్క కూడా నీరు కూడా పారని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఇప్పటి వరకు రూ.6 వేల కోట్లను ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారన్నారు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరుగుతోందన్నారు. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం, బడ్జెట్‌లలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ ప్రాంత భూగర్భ జలాల్లో ఎంతో ప్రమాదకరమైన ఫ్లోరిన్, స్టోనియంలాంటి దాతువులతో ప్రజలు కిడ్నీ వ్యాధులు, కీళ్ల పెలుసుబారిపోవడంలాంటి వ్యాధుల బారినపడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నింటికీ వెలిగొండ ప్రాజెక్టు మాత్రమే పరిష్కార మార్గమన్నారు. గత ఐదేళ్లు పాలించిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల్ని నిలువునా మోసం చేసిందని దుయ్యబట్టారు. ఎన్నో పనులు పెండింగ్‌లో ఉన్నా మొదటి దశ పూర్తి చేసినట్లు శిలాఫలకాలు వేసి జాతికి అంకితం చేయడం విడ్డూరమన్నారు. రెండు టన్నెల్స్‌లో గత ఐదేళ్లలో ఇష్టారీతిన పనులు జరిగాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఒకటో టన్నెల్ నుంచి రంధ్రాలు వేసి రెండో టన్నెల్‌లో తవ్విన మట్టిని పోశారన్నారు. అంతేకాక రెండో టన్నెల్ పనుల్లో కూడా చాలా అవినీతి చోటు చేసుకుందన్నారు. ఈ మధ్యనే ప్రాజెక్టును మంత్రుల బృందం సందర్శించడంతో ఈ ప్రాంత ప్రజలకు ఆశలు చిగురించాయని చెప్పారు. రెండేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రులు చెప్పారన్నారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపులు వారి వివక్ష పూరిత వైఖరిని చాటి చెప్పిందని విమర్శించారను. ఆ నిధులు ఉద్యోగులు జీతభత్యాలు, పెండింగ్ బిల్లులకే సరిపోతాయన్నారు. ప్రధానంగా మొదటి టన్నెల్‌లో చివర 1.5 కిలో మీటర్ల మేర లైనింగ్, ఫీడర్ కెనాల్‌ను పటిష్టంగా నిర్మించడం, నిర్వాసితులకు ప్యాకేజీలాంటి వాటికి రూ.1,500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలి

మార్కాపురం డివిజన్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని ప్రభుత్వ నిధులతోనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఈ పద్ధతిని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మార్కాపురంలో ప్రభుత్వ వైద్యసేవలు ఎంతో అవసరమన్నారు. పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీ పూర్తిచేస్తే ప్రైవేటు యాజమాన్యాలు ఉచిత వైద్యం అందిస్తాయా..? అని ప్రశ్నించారు. అదే విధంగా మార్కాపురం జిల్లాను తప్పక ఏర్పాటు చేస్తామని పలు పర్యాయాలు ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. నేడు జిల్లా ఊసే ఎత్తడంలేదన్నారు. జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జీవీ కొండారెడ్డి, సోమయ్య బాలనాగయ్య రఫీ, రూబెన్, రాజు, నిర్వాసితుల సంఘం నాయకులు బుర్రి చిన్నవెంకటేశ్వర్లు, చిన్నరంగారెడ్డి, బాలపిచ్చయ్య, కొండయ్య పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న జేసీ

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- జేసీ గోపాలకృష్ణ
- కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్/ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో 17వ వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ నాయకత్వం, జవాబుదారీతనం, సహనం, ఆత్మవిశ్వాసం, జీవననైపుణ్యాలను నేర్పించడంలో క్రీడలు దోహదపడుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాబోధనతో పాటు క్రీడా రంగానికీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇటీవలే క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో ఇస్తున్న రిజర్వేషన్లను రెండు నుంచి మూడు శాతానికి పెంచిందని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ నైపుణ్యం గల క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ముందుగా జేసీ గోపాలకృష్ణ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆటల పోటీలను జేసీ ప్రారంభించారు. క్రీడల్లో విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్ కుమార్, యూబీఐ మేనేజర్ ప్రసాద్‌సాహూ, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.



జాతీయ పతాకం రంగులతో విద్యార్థులు



అబ్బురపరిచిన విద్యార్థుల ప్రదర్శనలు

అలరించిన ప్రదర్శనలు

కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా చిన్నారులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివాజీ, ఠాగూర్, అశోక్, రామన్ గ్రూపులుగా ప్రత్యేకమైన యూనిఫాంలతో ఆకర్షణీయంగా కనిపించగా, వారి నృత్యాలు, విన్యాసాలు, భారత జాతికీర్తిని ఇనుమడింపజేసేలా ప్రదర్శనలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి.


ఊరచెరువురోడ్డులో..


కొత్త మార్కెట్‌రోడ్డులో నిలిచిన వర్షపునీరు


గోతులమయంగా కొప్పోలు రోడ్డు


కొత్తపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద..

రోడ్లు డొల్ల..ఒళ్లు గుల్ల..

- నగరదారులన్నీ గతుకులమయం
- వర్షాలకు పలు కాలనీల్లో కష్టాలు


కమ్మపాలెంరోడ్డులోని గుంతలో నిలిచిన నీరు

నగరంలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. గత వైసీపీ పాలనలో అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా రోడ్ల నిర్మాణాలు లేకపోగా, ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు అయితే రోడ్లు రోత పుట్టించేలా గతుకులమయంగా మారాయి. మరోవైపు మట్టిదిబ్బలు పేరుకుపోవడమే కాకుండా కంకర రోడ్లపైకి చేరడంతో రహదారులన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో నగరంలో ప్రయాణించే వాహనదారులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ బురదగా మారాయి. గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలబడటంతో కాలు బయటకు పెట్టలేని పరిస్థితి పలు కాలనీల్లో నెలకొన్నాయి. వర్షాలకు రహదారుల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీంతో జనం నగరంలో రాకపోకలు సాగించేందుకు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)


టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గొయ్యి

14నుంచి డీఎల్ఈడీ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం సంతపేటలోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు డీఎల్ఈడీ రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. లాంగ్వేజ్ పండిట్ శిక్షణ కోర్సు థియరీ పరీక్షలు గుంటూరులోని ఎస్ఎస్ ప్రభుత్వ హైస్కూలులో ఈనెల 14నుంచి 19వతేదీ వరకు జరుగుతాయన్నారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగంలో రాణించిన అగ్నికుల క్షత్రియ క్రీడాకారులను మంగళవారం ఒంగోలులోని అగ్నికుల క్షత్రియ ఆరామ క్షేత్ర సామాజిక భవన్ ఘనంగా సత్కరించారు. పలు క్రీడల్లో రాణించిన మోపిదేవి ధాత్రియ గదారమ్మ, కొక్కిలిగడ్డ సాయిరాం, దండుప్రోలు గోపీరాజు, దండుప్రోలు సాయికిరణ్, తంబు యశ్వంత్‌లను శ్రీరామ హాస్పటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఒలంపిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్ర భాస్కరరావు, సామాజిక భవనం అధ్యక్షుడు వల్లభని రంగారావు, వెయ్యాల వెంకటేశ్వర్లు, శిరిగిరి రంగారావు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి రామకృష్ణ

మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పొగాకు నారులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కార్యనిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. గత ఏడాది లభించిన ధరలు చూసి పొగాకు అధికంగా సాగు చేయకుండా నియంత్రించాలని, అధిక పంట వేస్తే నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో లీఫ్ మేనేజర్ ఆర్ల రామాంజనేయులు, అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, బోయపాటి వెంకయ్యచౌదరి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు


మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని దీప్తి గ్రానైట్ యజమాని మండవ రత్నాకర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటరులో ఫ్యాక్టరీ యజమానుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల కేంద్రంలో దొంగల తాకిడి పెరిగిందని, వాటిని నియంత్రించేందుకు యజమానులందరూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఎం.హరిబాబు మాట్లాడుతూ పరిశ్రమల కేంద్రంలో మౌలిక వసతులు కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. డంపింగ్ కేంద్రంతో పాటు పలు రోడ్ల సమస్యలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు, ఫ్యాక్టరీ యజమానులు పాల్గొన్నారు.

సర్వేలో జ్వరపీడితులను గుర్తించాలి

- జిల్లా మలేరియా అధికారి శ్రావణ్‌కుమార్

సింగరాయకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పీహెచ్‌సీని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీవర్ సర్వే ద్వారా మండలంలోని జ్వరపీడితులను గుర్తించాలని, వారి నుంచి రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం వెక్టార్ కంట్రోల్, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగ్యూ, గున్యా వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్యకృష్ణ, వంశీధర్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాగర్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, రాజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఉప్పుగుండూరు విద్యార్థి


గోపి

నాగులుప్పలపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోల్ జంప్ పోటీలకు ఉప్పుగుండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వి.గోపి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేపీ.రంగనాయకులు మంగళవారం తెలిపారు. త్వరలో ఝార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి గోపీ ఒక్కరే పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో గోపిని అభినందించారు.

గ్రామసభలో 82 వినతులు

జరుగుమల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): కె.బిట్రగుంటలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 82 రీసర్వేపై అర్జీలు ప్రజల నుంచి వచ్చాయి. తహసీల్దార్ బి.జనార్దన్, సర్వేయర్ బాబూరావు పాల్గొన్నారు.

నగరంలో రోడ్‌సైడ్ ఆక్రమణల తొలగింపు

- పరిశీలించిన కమిషనర్


ఊరచెరువులో ఆక్రమణలను తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ ఎదురు రోడ్‌సైడ్ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేవలం తోపుడుబండ్లు మాత్రమే ఉండాలని, ఎలాంటి కట్టడాలు గానీ తాత్కాలిక నిర్మాణాలు, షెడ్డులు వేయకూడదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి పలు తాత్కాలిక షెడ్‌లను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఇక మార్కెట్ లోపల రోడ్డుపై ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంట ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్ సమస్య రాకుండా తోపుడు బండ్లుతో వ్యాపారాలు చేసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఇచ్చిన కొద్ది స్థలాన్ని శాశ్వతంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నగరంలోని అన్ని రోడ్ల వెంట ఆక్రమణలు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, టీపీవో ప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి, ఆర్వో విజయ్ భాస్కర్, ఆర్ఐ కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నగరంలో వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరావు తెలిపారు. మంగళవారం స్థానిక తన చాంబర్‌లో జంతు సంరక్షణ ఫౌండేషన్, పశు సంవర్థక శాఖ, శానిటేషన్ అధికారులతో ఆయన మాట్లాడారు. వీధికుక్కల నియంత్రణకు అవసరమైన వ్యాక్సినేషన్ వేయాలని చెప్పారు. డివిజన్‌ల వారీగా వీధి కుక్కలను అదుపులోకి తీసుకుని కొత్తమామిడిపాలెంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించాలని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంహెచ్‌వో మనోహర్‌రెడ్డి, ఎంఈ చంద్రయ్య, శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణకు చలో పార్లమెంట్

- ఎల్ఐసీఏవోఐ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్



మాట్లాడుతున్న మంజునాథ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంస్థ ఎల్ఐసీని పరిరక్షించుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా(ఎల్ఐసీఏవోఐ) వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్ తెలిపారు. ఎల్ఐసీఏవోఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం మంగళవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఐఆర్డీఏ ప్రతిపాదించిన నూతన విధానాల వల్ల ఏజెంట్ల కమిషన్ పెంచకపోగా తగ్గించారన్నారు. పాలసీలపై ప్రీమియం, కనీస బీమాను పెంచడం, వయోపరిమితిని కుదించడం వల్ల ఇన్సూరెన్స్ తీసుకునే వారి సంఖ్య తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. ఎల్ఐసీని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసి కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఈ చర్యలను యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జోనల్ ప్రధానకార్యదర్శి పీఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఐఆర్డీఏఐ, కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 10 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు డివిజనల్ ఆఫీసు వద్ద ధర్నాలు, డిసెంబరు 20నుంచి ఏజెంట్లు, ఖాతాదారులు, ప్రజల వద్ద నుంచి కోటి సంతకాల సేకరణ, దేశంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల ఎంపీలకు వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 11న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో ఏజెంట్లు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, రాష్ట్ర కోశాధికారి పి.శ్రీనివాసరావు, నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు బెజవాడ శివయ్య, ప్రధానకార్యదర్శి సీహెచ్.నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు, కోశాధికారి జి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


ఏపీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఉపాధి సిబ్బంది నిరసన

మర్రిపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పర్చూరు ఏపీవో బుల్లెయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్‌మొహిద్దీన్‌లపై దాడి అమానుషమని మర్రిపూడి ఏపీవో గడ్డం రాంబాబు అన్నారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. దాడికి పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్రపాల్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, శ్రీనివాసరెడ్డి, నరసింహం, ఖాజావలి, కాలేషా, బాబు, గురవయ్య, మోహన్‌రావు, కొండలు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలకూరపాడు హెచ్ఎంకు సత్కారం


హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆలకూరపాడు (టంగుటూరు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీలకు ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 22,23,24 తేదీల్లో మహారాష్ట్రలోని పూణెలో జరిగే అఖిల భారత సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్ ఆవరణలో వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో దామచర్ల శ్రీధర్, జ్యోతి, చెన్నయ్య, విజయలక్ష్మి, సుబ్బారావు, వెంకట్రావు, సుభాషిణి పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన 12 మంది విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కొండపిలో ఓ మోస్తరు వర్షం


గొడుగులపాలెంలో సీసీరోడ్డు జలమయం

కొండపి, నవంబరు 12 : అల్పపీడన ప్రభావంతో కొండపి ప్రాంతంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొండపిలోని ప్రధాన వీధులు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి వర్షపు నీరు కామేపల్లి, టంగుటూరు రోడ్డు వైపునకు ప్రవహించింది. ప్రధాన వీధిలోని గృహాల యజమానులు తమ ఇళ్ల ముందు ఉన్న సైడు కాలువలు పూర్తిగా రాళ్లతో కప్పి వేశారు. దీంతో ఇళ్లలో నీరు సైడు కాలువల్లోకి వస్తోంది. వర్షపు నీరు మాత్రం కాలువల్లోకి వెళ్లలేక రోడ్డుపైనే ప్రవహించింది. మద్దులూరు రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద కూడా రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. దాసరెడ్డిపాలెం, గొడుగులపాలెం, ఇంకా పలు కాలనీల్లో సైడు కాలువల్లోని నీరు నిండిపోయి రోడ్డుమీదకు భారీగా చేరింది. గొడుగులపాలెంలో రెండు వైపులా మెరకలు తోలి ఇళ్లు ఎత్తుగా నిర్మించుకోవడంతో రోడ్డు పల్లమైపోయింది. దీంతో ఓ మోస్తరు వర్షానికే నీరు రోడ్డుపైచేరింది.

పచ్చాకు కూలీల రక్షణకు చట్టం తేవాలి

కొండపి, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : పొగాకు పచ్చాకు ముఠా కూలీల రక్షణకు ప్రభుత్వం చట్టం తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని మిట్టపాలెం గ్రామంలో మంగళవారం ఆయన పచ్చాకు ముఠా కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో కూలీలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, కొందరు అంగవైకల్యానికి గురవుతున్నారన్నారు. అలాంటి వారికి ప్రభుత్వ సాయం అందడం లేదని అంజనేయులు అన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కేజీ మస్తాన్, సీఐటీయూ నాయకుడు గడ్డం వందనం, నాయకుడు తలారి రవి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మర్రిపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి వీరబాబు సూచించారు. బాల ఆరోగ్య సురక్షలో భాగంగా మర్రిపూడి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18సంవత్సరాలు వయసుపైబడిన వారికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగేశ్వరరావు, హెచ్‌బీ రమాదేవి, సూపర్‌వైజర్ సుచరిత ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షంతో పొగాకు రైతుల హర్షం

చీమకుర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : విశాక కార్తెలో కురిసే వర్షం.విషం వంటిదనే నానుడి రైతుల్లో ఉంది. ఈ వర్షం వల్ల చీడపీడల బెడద ఉంటుందని వారి భావన. కానీ కాలానుగుణంగా చోటుచేసుకున్న మార్పులతో ఇదే కార్తెలో కురిసిన వర్షాన్ని బంగారు వాన అని అనుకోవాల్సి వచ్చింది. మంగళవారం చీమకుర్తి మండలంలో కురిసిన తేలికపాటి వర్షం రైతుల్లో హర్షాన్ని నింపింది. పదిరోజుల క్రితం పొగాకు మొక్కలను రైతులు పెద్దఎత్తున నాటారు. అప్పటి నుంచి ఎండలు కాయటంతో మొక్కలు బతికినా ఎదుగుదల లోపించింది. వర్షపుజల్లు పడితే పంటకు ఉపయోగపడుతుందని రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్న సమయంలో కురిసిన వానకు ఈ ప్రాంత రైతులు బంగారు వానగా అభివర్ణిస్తున్నారు.


చంద్రపాడు వద్ద సాగు చేసిన పొగాకు

బసవన్నపాలెంలో దొంగల హల్‌చల్

- ఐదు ఇళ్లలో చోరీ

మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బసవన్నపాలెంలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసిన ఐదు గృహాలను టార్గెట్ చేసి విలువైన సామగ్రి తస్కరించిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. బసవన్నపాలెంకు చెందిన మండవ వెంకట్రావు, మండవ రామాంజనేయులు, మండవ రమణమ్మ, మండవ లీలమ్మ, మండవ శ్రీనివాసరావు గృహాలు తాళం వేయటం గమనించిన దుండగులు సోమవారం అర్ధరాత్రి చోరీకి తెగబడ్డారు. గృహాల్లో వస్తువులను చిందరవందర చేసి రాగి, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో దీప్తి గ్రానైట్, వినీల గ్రానైట్‌లలో పాత సామగ్రిని, రాగి వస్తువులను తస్కరించారు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయభ్రాంతులవుతున్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బూరేపల్లికాలనీ సమీపంలో స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. నాగులుప్పలపాడు నుంచి మేదరమెట్ల వెళ్తున్న అద్దంకి పట్టణానికి చెందిన పారెళ్ల రమాదేవి కొత్తకోట వాగు దాటి బూరేపల్లి కాలనీ సమీపంలో వస్తుండగా గేద అడ్డురావటంతో స్కూటీ అదుపు తప్పి కింద పడింది. దీంతో ఆమెకు గాయాలు కాగా చికిత్స కోసం అద్దంకి తీసుకువెళ్లారు.

మినుములో ఇనుపధాతు లోపం



మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మినుము పంటలో వచ్చే ఇనుప ధాతు లోపం పట్ల రైతులు జాగ్రత్తలు వహించాలని ఏవో వెంకట్రావు సూచించారు. కంట్లగుంట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన రబీ సీజన్‌కు సంబంధించి ఈ నెల 16వ తేదీ నుంచి ఈ-పంట నమోదు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా మినుము పంటలో ఇనుప ధాతు లోపం వస్తుందని, దానివల్ల ఆకులు తెల్లగా మారతాయని చెప్పారు. దీని నివారణకు 5 గ్రాముల అన్నబేధి, 3 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీలలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రాయితీపై వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ అధికారి జాస్మిన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేయాలి


ఎస్పీ దామోదర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో 4వ తరగతి విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా కోరారు. మంగళవారం ఒంగోలులో ఎస్పీ దామోదర్‌ను ఆయన తన పార్టీ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిసి జరిగిన దారుణం గురించి మాట్లాడారు. దీనిపై ఎస్పీ మాట్లాడుతూ కేసు విచారణ జరుగుతోందని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కైపు వెంకటకృష్ణారెడ్డి, పాలపర్తి విజేష్‌రాజు, షేక్ రసూల్, పైనం మధు, కరీముల్లా పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ఉత్తమ అవార్డుగా ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. మంగళవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ కళ్యాణి మాట్లాడుతూ కాలేజీకి న్యాక్‌ఏప్లస్ వచ్చేందుకు శ్రీనివాసరెడ్డి చేసిన కృషిని కొనియాడారు. ఆయన రాష్ట్రస్థాయి అవార్డు పొందడం కళాశాలకు గర్వకారణమన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంచాలకులు కుసుమకుమారి, చెన్నమనేని శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, పి.ఇందిర, మంజులభారతి, ఏవీ.రాజ్యలక్ష్మి, జేఎస్. సురేష్ కుమార్, ఏకేయూ అకడమిక్ కౌన్సిల్ సభ్యుడు జి.రామ్మోహన్‌రావు, ప్రొఫెసర్ ఎస్.నిర్మల, జి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు


దీపాలత, సురేష్‌బాబులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో లీగల్ రైట్స్ ఫర్ ఎవరీ గర్ల్ అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా న్యాయవాదులు దీపలత, సీహెచ్.సురేష్‌బాబు హాజరై మాట్లాడారు. మహిళల తమ జీవితంలో మెరుగైన స్థాయికి చేరుకునేందుకు సమాజంలో అనేక ఇబ్బందికర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఆయాఅంశాలను అధికమించేందుకు రాజ్యాంగంలో ఉన్న మహిళా హక్కులను తెలుసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా ఎప్పుడైనా పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. కొంత మంది విద్యార్థులు తమ జీవితంలో జరిగిన అనుభవాలను వారి దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సీవీ.సుబ్బారావు, కె.రూపలక్ష్మీష్, వీరాంజనేయులు, ఏవో రమణబాబు, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దీపాలత, సురేష్‌బాబులను సన్మానించారు.

ఆరోగ్యకేంద్రం పరిశీలన


జూమ్ యాప్ ద్వారా మందుల పరిశీలన

మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బసవన్నపాలెంలోని ఆరోగ్యం కేంద్రాన్ని మంగళవారం జూమ్ యాప్ ద్వారా ఎన్క్వాస్ నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రేమాను పాండ్య, డాక్టర్ రుక్మిణి పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎన్.కృష్ణప్రసాద్, డాక్టర్లు శ్రావణ్ ఆనందమోహన్, వినీల జగదీష్, రజితకుమారి, నాగరాజి పాల్గొన్నారు.

నాగుపాము కలకలం

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగట్ల ఎస్సీ కాలనీలోకి నాగుపాము ప్రవేశించింది. అటూ ఇటూ తిరుగుతూ ఒక ఇంట్లోకి వెళ్లగా గ్రామస్థుల సమాచారంతో డీఆర్‌వో వంశీకృష్ణ ఆధ్వర్యంలో రెస్క్యూ టీం సభ్యులు నాగుపామును పట్టుకొని సమీప అడవిలో వదిలి వేయడంతో ఎస్సీ కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏపీవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి సిబ్బంది

మార్కాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్యజ్యోతి). పర్చూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎపిఓ పై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఎపిఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మార్కాపురం మండల ఎపిఓ జీవరత్నం ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎపిఓ పై దాడికి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎపిఓ పై జరిగిన దాడిపై ఖండన తెలియజేస్తూ ఉపాధి హామీ పథకం సిబ్బంది పై దాడులను ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపిఓ జీవరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇసి సుభద్ర, టి ఎలు కాశయ్య, శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 104 సిబ్బంది నిరసన

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 12(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ 104 ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు వారి డిమాడ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా ఎర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలలో పరిధిలో పనిచేస్తున్న 104 సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. ఈవో సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా యూనియన్ అదేశాలతో విధులు నిర్వహిస్తునే నల్లబ్యాడ్జిలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



సూచిక బోర్డులు లేని శింగరపల్లె అడ్డరోడ్డు

బేస్తవారపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగరపల్లె గ్రామ సమీపంలోని వై.జంక్షన్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నపించుకున్న పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ వైజంక్షన్ నుంచి ప్రాచీన దేవాలయమైన బైరవకోన, నారాయణస్వామి దేవాలయం, సి.యస్‌పురం,పామూరు, నెల్లూరు, ఉదయగిరికి వేళ్ళేవారు ఈరహదారిన వెళుతున్నారన్నారు. కంభం, మార్కాపురం, శ్రీశైలం, గిద్దలూరు, నంద్యాలకు వెళుతున్న ప్రైవేటు వాహనదారులు చాలా మేరకు ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తున్నారు. అయితే శింగరపల్లె వై.జంక్షన్ నుండి ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కావున ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, శింగరపల్లె గ్రామస్థులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

పెద్ద దోర్నాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందిన ఘటన స్థానిక ఉర్దూ పాఠశాల సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి పక్కన మంగళవారం వెలుగు చూసింది. చెట్టు కింద తెల్లని చొక్కా, పంచా ధరించి ఉన్నాడు. సుమారు 65 ఏళ్ల వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. గమనించిన స్థానికులు పోలీసు స్టేషనులో సమాచారం ఇచ్చారు. ఎస్సై మహేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యంసేవించి నీటి దాహంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నానో ఎరువులు వినియోగించాలి

గిద్దలూరు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగలరెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం కోర్‌మండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నానో ఎరువులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రసాయన ఎరువుల మీద దాదాపు రూ.2 లక్షల కోట్లు వెచ్చిస్తోందన్నారు. రైతులు విచ్చలవిడిగా ఎరువులు వాడడం వలన అదనంగా బడ్జెట్ కేటాయించాల్సి వస్తోందన్నారు. ఈ ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులైన నానో డీఏపీ, నానో యూరియా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. రైతులు లిక్విడ్ ఫర్టిలైజర్స్ వాడాలని సూచించారు. కోరమండల్ కంపెనీ ప్రతినిధులు మోహన్‌కుమార్, తిరుపతిరావు, వీరాంజనేయులు, హరినాథరెడ్డి మాట్లాడుతూ నానో డిఎపి యొక్క ప్రాముఖ్యతను, పని విధానాన్ని రైతులకు వివరించారు.

కాశిరెడ్డి కుంట స్థలం ఆక్రమణల పరిశీలన



కుంట ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నరవ రోడ్డులోని కాశిరెడ్డికుంట స్థలాన్ని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్ పరిశీలించారు. కుంట స్థలం ఆక్రమణలకు గురైనప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాశిరెడ్డికుంట 8 ఎకరాలకు పైగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. 9 సర్వే నెంబర్లలో ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందడంతో జిల్లా సర్వేయర్ సహకారంతో పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్‌కు నివేదించి ఆక్రమణలకు గురై ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, సర్వేయర్లు ఉన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

కాశిరెడ్డి కుంటను పరిశీలిస్తున్న సందర్భంలో ఆ వీధంతా అపరిశుభ్రంగా ఉంది. దీంతోపాటు కొన్ని చోట్ల వర్షం నీరు రోడ్డు మధ్యలో నిలబడి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సబ్ కలెక్టర్ త్రివినాగ్ అసహనం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే రోగాలు రావా అంటూ కమిషనర్ వెంకటదాస్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలు తిరిగే రోడ్డు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

వ్యాపార కేంద్రాలుగా సెల్లార్లు

- రోడ్లమీదే వాహనాల పార్కింగ్
- పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు ఇదే ప్రధాన కారణం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం

నెహ్రూబజార్‌లోని ఓ బ్యాంకు పక్కన వున్న బహుళ అంతస్థుల భవనంలో మూడు అంతస్థుల్లో రకరకాల వ్యాపారాలకు అద్దెకిచ్చారు. అక్కడికొచ్చే అవసరార్థులు వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తుంటారు. భవనం కింద సెల్లార్ ఉన్నా అందులో చైనా బజార్‌కు యజమాని అద్దెకిచ్చాడు. దీంతో ఇక్కడికి వచ్చే వాహనాలు రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. దీంతో నిత్యం వందలాది వాహనాలు, వేలాదిమంది ఆ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. స్థానిక సత్యనారాయణ స్వామి గుడి ప్రాంతంలోని ఓ భవనంలో కూడా ఇదే పరిస్థితి. ఒక అంతస్థులో బ్యాంకు, పై అంతస్థుల్లో లాడ్జీ నిర్వహిస్తున్నారు. కింద సెల్లార్‌లో ఓ బహుళజాతి సంస్థ షోరూమ్ ఉంది. దీంతో అక్కడికి వచ్చే వాళ్లు వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. అటుగా వెళ్లేవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.



మార్కాపురం, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలోని ప్రధాన వీధుల్లో సెల్లార్ ఉన్న ఏ బహుళ అంతస్థుల భవనంలో కూడా వాహనాలు పార్క్ చేసేందుకు ఉపయోగించడంలేదు. వాటిని అద్దెలకిచ్చి యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. వాస్తవానికి మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా సెల్లార్‌లు నిర్మించుకోవడానికి అనుమతులు లేవు. భవనాలు నిర్మించేటప్పుడే పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందికి జేబులు తడిపి అనధికారికంగా సెల్లార్లు నిర్మించారు. సెల్లార్‌లు నిర్మించిన తర్వాత వాటిని అద్దెకిస్తున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనాలను రోడ్లపై నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ముఖ్యంగా రాజాజీ వీధి, రథం బజార్, నెహ్రూబజార్, దోర్నాల బస్టాండ్ ప్రాంతం, కంభం రోడ్డుల్లో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం సుమారు 25 వరకు బహుళ అంతస్థుల భవనాల్లోని సెల్లార్లను వ్యాపార కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది.

ట్రాఫిక్ సమస్యతో పోలీసుశాఖపై తీవ్ర ఒత్తిడి

మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగం కాసుల కక్కుర్తి కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. దీంతో పోలీసు శాఖపై ఆ ప్రభావం పడుతోంది. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలంటే వారికి తలకు మించిన భారమౌతోంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలను వన్‌వేలుగా ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లిస్తున్నారు. అయినా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో ట్రాఫిక్ అప్పుడప్పుడూ స్తంభిస్తోంది. హోమ్‌గార్డులు నిరంతరాయంగా కష్టపడితే మినహా ఆయా ప్రాంతా ల్లో ట్రాఫిక్ కష్టాలను కొంతమేరకైనా తగ్గే పరిస్థితి లేదు.



నెహ్రూబజారులో ఓ బహుళ అంతస్తుల భవన సెల్లార్లలోని చైనాబజార్

సెల్లార్లపై చర్యలు తీసుకోకుంటే కష్టమే

మార్కాపురం పట్టణ నానాటికీ పెరుగుతోంది. అంతేకాక వాహనాల సంఖ్య కూడా ఏటికేడు విపరీతంగా పెరుగుతోంది. ప్రతి ఇంటికి ఒకటి రెండు వాహనాలు తప్పనిసరయ్యాయి. వ్యక్తిగత వాహనాలకు తోడు ప్రయాణికులను తోలే ఆటోలు, ట్రాలీ ఆటోలు కూడా రద్దీ ప్రాంతాల్లో తిరుగుతుంటాయి. ఈ క్రమంలో కొన్ని సమయాల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ప్రస్తుతం పట్టణంలోని ప్రధాన వీధుల్లోని సెల్లార్లను పార్కింగ్ ప్రాంతాలుగా ఉపయోగిస్తే ట్రాఫిక్ సమస్యకు అడ్డుకట్ట పడుతుంది. ఆ దిశగా మున్సిపాలిటీ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు

సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీలులేదు. పట్టణంలోని సెల్లార్లు ఉన్న అన్ని భవనాల యజమాలను ఇప్పటికే హెచ్చరించాం. అసలు వాటిని నిర్మించుకోవడానికి అనుమతులే లేవు. పట్టణం మొత్తమే కాక వ్యాపార కార్యకలాపాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లోని వాటిపై ప్రధానంగా దృష్టిసారించాం. త్వరలో వాటిని తొలగించే ప్రక్రియను ప్రారంభించనున్నాం. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు.

నారాయణరావు, కమిషనర్, మార్కాపురం మున్సిపాలిటీ

నెహ్రూబజార్‌లో సెల్లార్‌లోనే దంత వైద్యశాల

నిత్యం రోగులు, ప్రజలతో కిటకిటలాడే నెహ్రూ బజార్‌లోని వైద్యశాల వీధిలో ఓ పెద్ద బహుళ అంతస్థుల భవనం ఉంది. అక్కడ ఒక అంతస్థులో సూపర్ మార్కెట్, పై అంతస్థుల్లో రెస్టారెంట్, కల్యాణ మండపాలు ఉన్నాయి. ఆ భవనం వద్దకు వచ్చే వాళ్లు వాహనాలను రోడ్డుపైనే నిలుపుకోవాల్సి వస్తోంది. భవనం కింద సెల్లార్ ఉన్నా ఒకదాంట్లో వైద్యశాల, మరొక దాంట్లో ఫోటో స్టూడియో, ఇంకో దాంట్లో ల్యాబ్‌లు ఉన్నాయి. సెల్లార్‌లోని ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించి అద్దెలకిచ్చి భవన యజమాని సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో పార్కిగ్ సమస్య తలెత్తుతోంది.

అమ్మవారిశాల ఎదురు ఇలా

- మార్కాపురం పట్టణంలోని మెయిన్ బజార్‌లో అమ్మవారిశాల ఎదురుగా ఓ వ్యాపారవేత్తకు చెందిన బహుళ అంతస్థుల భవనం ఉంది. కింద అంతస్థులో ఓ బ్యాంకు, రెండు దుకాణాలు, పైరెండు అంతస్థుల్లో కళ్యాణ మండపం ఉంది. అక్కడికి వచ్చే వాళ్లు వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. సెల్లార్ ఉన్నా అందులో కూడా దుకాణాలకు అద్దెకు ఇవ్వడంతో ఆ భవనం ముందు వాహనాలు నిలుపుతున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అంతేకాక ఆ వ్యాపారవేత్తకు పోలీసు స్టేషన్‌కు పక్కన కూడా ఓ భవనం ఉంది. పైనలాడ్జీ నిర్వహిస్తున్నారు. అక్కడ కూడాసెల్లార్ ఉన్నా అందులో వాహనాలను నిలుపకుండా దుకాణాలకు అద్దెకిచ్చారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో వాహనదారులు అవస్థలు పడాల్సివస్తోంది.



తెప్పోత్సవాన్ని విజయవంతం చేయాలి

పలు శాఖల అధికారులకు సబ్ కలెక్టర్ త్రివినాగ్ సూచన



పుష్కరిని వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మార్కాపురంలోని పుష్కరిణిలో జరిగే చెన్నయ్య తెప్పోత్సవాన్ని విజయవంతం చేయాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. స్థానిక పుష్కరిణి వద్ద మంగళవారం జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. చెరువు నుంచి నీటిని పంపింగ్ చేసే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. తెప్పోత్సవం బుధవారం మధ్యాహ్నం జరుగుతుందన్నారు. అప్పటి వరకు నీటిని పంపింగ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా తెప్పోత్సవం జరిగే సమయంలో ప్రజలు నీటివద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది కూడా విధుల్లో ఉంటారని సీఐ సుబ్బారావు తెలిపారు. తెప్పోత్సవం నీటిలోకి దిగి ప్రమాదాల బారినపడ కుండా పోలీసు సిబ్బందిని అక్కడ ఉంచాలన్నారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావు, ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీరు వెళ్లేందుకు పైపులైన్ ఏర్పాటు

కంభం-కందులాపురం కలిపే రోడ్డులో తొలగనున్న ఇక్కట్లు



మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంభం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంభం- కందులాపురం పంచాయతీ పరిధిలోని రోడ్లపై నిలిచిన మురికినీరు వెళ్లేందుకు కందులాపురం పంచాయతీ అధికారులు మంగళవారం పైపులైన్ ఏర్పాటు చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'రోడ్లపై నిలిచిన మురికినీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. కంభం రైల్వేస్టేషన్, అర్బన్‌కాలనీకి వెళ్లే రహదారిపై నిలిచిన మురికినీరు వెళ్లేందుకు మంగళవారం పంచాయతీ అధికారులు ప్రధాన రహదారికి అడ్డంగా పైపులైన్ ఏర్పాటు చేశారు. దీంతో కంభం అర్బన్‌కాలనీ నుంచి వచ్చే మురికినీరు వెళ్లేందుకు మార్గం సుగమం అయింది.

నేడు విజయవాడలో మహాసత్సంగం

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 13న సాయంత్రం జరిగే మహాసత్సంగం కార్యక్రమానికి తరలిరావాలని స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ ధ్యానం గురించి, ఇతరత్రా ఆధ్యాత్మిక విషయాల గురించి మహాసత్సంగంలో వివరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణం పూర్తయ్యేనా?

పట్టెడన్నం కోసం ఎదురు చూస్తున్న ప్రజలు



అర్ధంతరంగా నిలిచిన అన్న క్యాంటిన్ నిర్మాణం

పొదిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో నిర్మించ తలపెట్టిన అన్నక్యాంటీన్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. స్థానిక పెద్దబస్టాండ్ సెంటర్లో క్యాంటీన్ నిర్మాణం కోసం పునాదులు వేశారు. త్వరలో పనులు పూర్తి అవుతాయి పేదవాడి ఆకలి తీరుతుందన్న దశలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో నిర్మాణపనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీనికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్‌లు మూతపడ్డాయి. నిరుపేదల ఆశలు అడియాశలయ్యాయి. నిర్మాణ పనులకోసం వేసిన పునాదులు నిత్యం ప్రజలను వెక్కిరిస్తున్నాయ్. కూటమి ప్రభుత్వం అధికారంతోకి రావడంతో పలు మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో అన్నక్యాంటీన్‌లను పునఃప్రారంభించారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. ముఖ్యం గా పొదిలి పట్టణం జిల్లా నడి కూడలిలో ఉంది. పట్టణానికి చుట్టుప్రక్కల మండలాల నుంచి నిత్యం వందలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రమంతట అన్నక్యాంటీన్‌లు ప్రారంభమౌతుండటంతో పొదిలి పట్టణంలో కూడా అన్నక్యాంటీన్ ప్రారంభిస్తారని నిరుపేద ప్రజలు ఎదరు చూస్తున్నారు. సామాన్యుడు బైట హోటళ్లలో అధిక ధరలు పెట్టి భోజనం తినలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ నేపధ్యంలో పట్టణం లో అన్నక్యాంటీన్ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు శాఖాగ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి మంగళవారం తెలిపారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు, చెస్, తాడాట, కుర్చీల ఆట తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. గ్రంథాలయం నుంచి పుస్తకాలను తీసుకుని ఇవ్వని వారు వారోత్సవాల సందర్భంగా తిరిగి ఇస్తే ఆలస్య రుసుము మాఫీ చేస్తామని, ఈ అవకాశాన్ని పాఠకులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

నేడు గ్రామసభ

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముండ్లపాడు పంచాయతీలో బుధవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు వీఆర్‌వో శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీసర్వేలో భూమిని కొలతలు ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్న రైతులు తగిన ఆధారాలు తీసుకుని గ్రామసభలో అర్జీలు దాఖలు చేస్తే విచారించి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

సామూహిక అభిషేకాలు



కార్తీక పూజలు చేస్తున్న దంపతులు

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ మందిరం ఆవరణలో కార్తీక ఏకాదశి సందర్భంగా సామూహికంగా శివునికి అభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున దంపతులు సామూహిక అభిషేకాల కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. మందిరం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, కమిటీ సభ్యులు ప్రత్యేకపూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాగా కార్తీక ఏకాదశి సందర్భంగా శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. అమ్మవారిశాల వెంకటేశ్వరస్వామి దేవాలయాలలో గంగమ్మ, గౌరమ్మలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం



సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న పిచ్చయ్య

గిద్దలూరుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సోమవారం విజయవాడలోని ఏ1 కన్వెషన్ హాలులో డాక్టర్ మొర్రి పిచ్చయ్య రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మండలంలోని పొదలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ముఖ్యమంత్రి జ్ఞాపిక, ప్రశంస పత్రం, మెడల్, ప్రైజ్ అమౌంట్‌ను అందచేశారు. ఈ అవార్డు తన తల్లిదండ్రులకు, సోదరులకు, గురువులకు అంకితం ఇస్తున్నట్లు మొర్రి పిచ్చయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

సొంత నిధులతో పిచ్చిమొక్కలు తొలగింపు

పొదిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల మైదానంలోని పిచ్చిమొక్కలను హబీబుల్లా సేవాసంస్థ ఆధ్వర్యంలో తొలగించారు. ప్రతినిత్యం వాకింగ్ కోసం ఎంతోమంది వస్తుంటారు. అయితే మైదానంలో పిచ్చిమొక్కలు ఉండటాన్ని గమనించిన కరిముల్లాబేగ్ సొంత నిధులు వెచ్చించి మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో గ్రౌండ్ మొత్తాన్ని శుభ్రం చేయించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రజలు కరిముల్లాబేగ్‌ను అభినందించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబవరం, వెల్లుపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఎస్.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన ద్వారా రైతులు తమ వాటా ప్రీమియాన్ని చెల్లించాలని, తద్వారా తాను సాగు చేసుకున్న పంటలు నష్టపోతే భీమా పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శనగ పంటకు ఎకరాకు రూ.368, మినుముకు రూ.103, జొన్నకు రూ.60, మొక్కజొన్నకు రూ.105, వరికి రూ.215 మిర్చికి ఎకరాకు రూ.525 ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో సాగైన కంది పంటను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్: మండలంలోని కొలుకుల, గొళ్లవిడిపి గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో కేవీ.శేషారెడ్డిరైతులతో కలసి కంది, పత్తి, మిరప, పొగాకు తదితర పంటలను పరిశీలించారు.

పొదిలి : మండలంలోని మాదాలవారిపాలెం, నంది పాలెం గ్రామాలో జైన్‌లుబ్దీన్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో కలిసి కందిపంటను సందర్శించారు. చీడపీడల నివారణకు పలు సూచనలు చేశారు.

మార్కాపురం రూరల్ : రైతులు పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని గోగులదిన్నె, వేమలకోట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పొగాకుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు కంది, మినుము, కొర్ర, సజ్జలు, శనగ, పెసరలు సాగు చేయాలన్నారు.

పెద్దదోర్నాల : ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని యడవల్లి, గంటవానిపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బత్తాయి, మిరప పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో వీహెచ్‌వో సంధ్యాబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : వరి పంటలో ఆకుచుట్టు తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహనా కార్యక్రమం జి.ఉమ్మడివరం గ్రామంలో మంగళవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమం సందర్భంగా రైతులతో కలిసి వరి పొలాలను సందర్శించారు. దీనిలో భాగంగా పంటలో ఆకుచుట్టు తెగులు నివారణ కు తగు సూచనలు చేశారు. నత్రజని ఎరువులు అధిక మోతాదులో ఉండడం ఈపురుగు ఉధృతి ఎక్కువ అవుతుందన్నారు.



గిద్దలూరులో మిరప తోటలు పరిశీలిస్తున్న అధికారులు

పుల్లలచెరువు : సాగులో వున్న కంది పూత దశలో వున్నదని ఈ దశలో రైతులు అప్రమత్తంగా వుండాలని మండల వ్యవసాయాధికారి పి.నిర్మలాదేవి అ న్నారు. మంగళవారం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బీరినేనిపల్లిలో సాగులో ఉన్న కందిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంది సాగు చేసిన రైతులు కంది పైరులో కంది పూత దగ్గర చేసి మారుకామచ్చల పురుగు పంటకు నష్టం జరుగుతోందన్నారు. దీని నివారణకు 5 శాతం వేప గింజల కషాయం పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా రైతులు డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీతో వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిఏవో రామయ్య వీఏఏలు కొండా నాయక్, బి వెంకటేశ్వర్లు, రైతులు పాలొన్నారు.

బేస్తవారపేట : మండలంలో పలు గ్రామాల్లో మొక్కజోన్న సాగుచేస్తున్న రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని విత్తనాలు విత్తనోత్పత్తి కోసం ప్రైవేటు వ్యక్తులు, ఏజెంట్ల వద్ద రైతులు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా వారి నుండి అగ్రిమెంట్ పొందాలని ఏవో జక్కం మెర్సీ అన్నారు. మంగళవారం మండలంలోని చెట్టిచెర్ల గ్రామంలో ఆమె ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సురేష్

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారీగా పనిచేయాలని ఎంపీడీవో బి.సురేష్ సూచించారు. మంగళవారం బొట్లగూడూరులోని ప్రాథమిక వైద్యశాల, గ్రామ సచివాలయం, అంగన్ వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకొన్నారు. సీజనల్‌లో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు.

సచివాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారుచేసి వడ్డించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనాన్ని ఏర్పాటుచేయాలన్నారు. అంగన్‌వాడీలో పిల్లల శాతాన్ని పెంచాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో షేక్ గరీబా, పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బత్తుల వెంకటేశ్వర్లు

దొనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం సీనియర్ నాయకుడు ఆదిమూలపు ప్రభుదాస్ తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శులు డి.వెంకటరెడ్డి, టి.రాజశేఖర్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కటారు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా బత్తుల వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా పి.శేషగిరి, కె.లత, ప్రధాన కార్యదర్శిగా బి.అంజినాయక్, కోశాధికారిగా ఈ.రోశయ్య, కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్‌గా పి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, ప్రధానోపాధ్యాయులు టి.కోటిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటరెడ్డి, దర్శి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.శ్రీను, పి.కాశీం, ఏ.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఈపంట నమోదు

దొనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈనెల 17 నుంచి ఈ పంట నమోదు చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని పెద్దన్నపాలెం, గంగదేవిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులే స్వయంగా బీమా ప్రీమియాన్ని మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోరు ఉన్న రైతులకు సబ్సిడీపై డ్రిప్, తుంపర సేద్యం పరికరాలను అందజేయనున్నట్టు చెప్పారు. పెద్దన్నపాలెం గ్రామంలో రైతులకు మట్టి నమూనా పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వీణాకుమారి, అరుణాదేవి, రైతులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని పామూరుకు చెందిన బీసీ చైతన్య సమితి రాష్ట్ర కన్వీనర్ ఓగూరి ఏడుకొండలు డిమాండ్ చేశారు. కులగణన చేపట్టాలని కోరుతూ బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మంగళవారం జరిగిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత వరప్రసాదిని అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.394 కోట్లు నిధులు కేటాయించడం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అధ్యక్షతన జరిగిన కూటమి శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన, మైనార్టీవర్గాల సంక్షేమానికి, సూపర్‌సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గత పాలకులు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం, అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సయ్యద్ అమీర్‌బాబు, ఆర్‌ఆర్ రఫి వై.రమేష్, బొల్లా నరసింహారావు. ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, గోళ్ల వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, దేవరపు మాల్యాద్రి, టి.సుబ్బారావు, ముబినా మౌలాలి, కావేరి రసూల్, మాచర్ల రహిమాన్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా కోటయ్య బాధ్యతల స్వీకరణ

కురిచేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండల విద్యుత్ శాఖ ఏఈగా కోటయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఈగా పనిచేసిన సుబ్బారెడ్డి బదిలీ కావడంతో ఖాళీ ఏర్పడింది. కొండపి నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆయనను అభినందించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

పీసీపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి జరిగిన అవకతవకలపై ప్రధానోపాధ్యాయుడి నుంచి సంజాయిషీ కోరుతూ మెమో జారీ చేయాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ మండల విద్యాశాఖాధికారిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెదవరిమడుగు ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో సంజీవినితో కలిసి ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో 52మంది విద్యార్థులకుగాను 32 మంది హాజరయ్యారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించగా సరిగాలేవు. మధ్యాహ్న భోజనంలో నెలకొన్న లోటుపాట్లకు సంబంధించి సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి మెమో జారీచేయాలని ఎంఈవోను ఆదేశించారు.

జోరుగా జీరో వ్యాపారం

- బిల్లులు లేకుండా క్రయవిక్రయాలు
- చోద్యం చూస్తున్న వాణిజ్య పన్నులశాఖ అధికారులు
- నష్టపోతున్న వినియోగదారులు

దర్శి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. అనేకరకాల వస్తువులకు బిల్లులు లేకుండా వ్యాపారులు క్రయ విక్రయాలు చేస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. నెలవారీ మామూళ్లు తీసుకుంటూ పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అనేకసార్లు బిల్లులు లేకుండా విక్రయిస్తున్న వంటనూనె, పాలపొడి తదితర వస్తువులు పట్టుబడిన విషయం తెలిసిందే. నర్సరావుపేట నుంచి దర్శికి జోరుగా కల్తీనూనె డ్రముల్లో దిగుమతి అవుతుంది. హైదరాబాద్ నుంచి పాలపొడి దిగుమతి అవుతుంది. ఈ పొడి ద్వారా అక్రమార్కులు కల్తీపాలు తయారుచేస్తున్నారు. వేలాది లీటర్లు కల్తీపాలు తయారుచేసి మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరుపుతున్నా ఆరోగ్య భద్రతాధికారులు పట్టించుకోవటం లేదు. బంగారం వస్తువులు కూడా బిల్లులు లేకుండా అనేకమంది విక్రయిస్తున్నారు. ఎవరైనా బిల్లు అడిగితే జీఎస్‌టీ 15శాతం చెల్లించాలని చెబుతుండటంతో కొనుగోలుదారులు బిల్లు తీసుకోకుండా సరిపెడుతున్నారు. ఈ అవకాశాన్ని ఆసరాగా తీసకొని కొంతమంది నాణ్యత లేని బంగారాన్ని కూడా విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనేకమంది వ్యాపారులు బంగారు బిస్కెట్లు కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. బంగారం ధర పెరిగినప్పుడు మార్కెట్‌లో చెలామణి చేసుకుంటా లబ్ధిపొందుతున్నారు. ఈవిధంగా అనేక రకాల వ్యాపారాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

గత ఏడాది బాణసంచా విక్రయదారులు జీఎస్టీ చెల్లించకుండా అమ్మకాలు జరుపుకొని ఈఏడాది దీపావళి వరకు లెక్కలు చెప్పలేదు. మళ్లీ ఈఏడాది బాణసంచా విక్రయించుకునేందుకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా వాణిజ్య పన్నుల అధికారులు ఇప్పుడు మేల్కొన్నారు. జీఎస్టీ చెల్లించలేదని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయటంతో ఈవిషయం బహిర్గతమైంది. అప్పటికీ మొక్కుబడిగా ఒక్కో వ్యాపారి నుంచి రూ.8వేలు జీఎస్టీ కట్టించుకొని మళ్లీ అనుమతి ఇచ్చారు. ఒక్కో వ్యాపారి బాణసంచాను రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తారు. అయినప్పటికీ కేవలం రూ.50 వేలు మాత్రమే వాణిజ్య పన్నులశాఖ అధికారులు జీఎస్టీ కట్టించుకున్నారు. దీన్నిబట్టి వాణిజ్య పన్నుల శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. కొంతమంది ఆ శాఖకు చెందిన సిబ్బంది అన్నీ వ్యాపార దుఖాణాల వద్ద మామూళ్లు వసూళ్లు చేసుకోవటం తప్ప పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో కొంతమంది వ్యాపారులు జోరుగా బిల్లులు లేకుండా వ్యాపారాలు చేస్తూ లబ్ధిపొందుతున్నారు. కల్తీ వస్తువులు కూడా మార్కెట్‌లో చెలామణి అవుతుండటంతో ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతినే పరిస్థితులు నెలకొంటున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ఉన్నతాధికారులు ఈవిషయాలపై దృష్టిసారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ అక్రమ వినియోగదారులపై దాడులు

వెలిగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అక్రమ వినియోగదారులపై ఆశాఖ అధికారులు దాడులు చేశారు. మండలంలోని రాళ్ళపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేసినట్టు డీఈఈ హైమావతి తెలిపారు. 28 మంది వినియోగదారులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్టు గుర్తించినట్టు చెప్పారు. వీరికి రూ.2 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. అనధికారకంగా వినియోగం, నిబంధనల ఉల్లంఘన, నిర్దేశిత సామర్థ్యం కన్నా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఈఈ వీరయ్య, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.



పసుపుగల్లులో గోకులం షెడ్డును పరిశీలిస్తున్న ఏపీడీ లలిత కుమారి

గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని దర్శి కస్టర్ ఏపీడీ ఆర్.లలితకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని పసుపుగల్లులో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 25 గోకులం షెడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించినవిధంగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శివరామకృష్ణప్రసాద్, శ్రీనివాసులు, బలరామ్, శైలేంద్ర కుమార్, చింతల రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల పదవులపై నేతల కన్ను

- ఎవరికివారు ముమ్మర ప్రయత్నాలు



ముండ్లమూరులోని ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయం

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 23న జరగనున్నాయి. పదవులు ఆశించేవారు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆశీస్సులతో పదవులు దక్కించుకోవాలని ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. మండలంలో రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో పది సాగునీటి సంఘాల అధ్యక్ష పదవులు ఉన్నాయి. రజానగరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఎనిమిది సాగునీటి సంఘాల అధ్యక్ష పదవులు ఉన్నాయి. దీని పరిధిలో మోహిద్దీన్‌పురం, పెదఉల్లగల్లు, ముండ్లమూరు, మన్నెపల్లి - 1, మన్నెపల్లి -2, తాళ్ళూరు- 1, వేముల -1, చింతలపూడి ఉన్నాయి. మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ పరిధిలో వేముల- 2, ఈదర- 2, వేములబండ, ఉమామహేశ్వర అగ్రహారం, మారెళ్ళ, తూర్పుకంభంపాడు, పోలవరం- 1, పోలవరం- 2, కొటికలపూడి, రామాయపాలెం ఉన్నాయి.

గ్రామాల్లో ఒక్కసారిగా సాగు నీటి సంఘాల ఎన్నికలతో వాతావరణం వేడెక్కింది. మోదేపల్లి డీసీ పరిధిలో వేములబండ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కంచుమాటి శ్రీనివాసరావు, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దిరిసాల శ్రీనివాసరావు, వేములకు చెందిన బేతా కోటిరెడ్డితో పాటు మరికొందరు డీసీ పదవిని ఆశిస్తున్నారు. ఎవరికివారు తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అలాగే, రజానగరం మేజరు పరిధిలో డీసీ చైర్మన్ పదవిని వలేటి చలపతిరావు, రెడ్డిమాసు రాఘవులు, బసవాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కట్టా మునలయ్యలతో పాటు మరికొందరు ఆశిస్తున్నారు. మంగళవారం ఆయా గ్రామ సచివాలయాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితా వీఆర్‌వోలు ప్రదర్శించారు. ఈక్రమంలో సాగునీటి సంఘాల ఎన్నికల రాజకీయం వేడెక్కుతుంది.

ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 23న జరగనున్న సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను మంగళవారం ఆయా గ్రామ సచివాలయాల్లో విడుదల చేసినట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ తెలిపారు. ఓటు హక్కు ఉన్న రైతులు జాబితాలను చూసుకొని తప్పులు, మృతి చెందినవారు ఉంటే తెలియజేయాలని సూచించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో వీఆర్‌వోలు జాబితాలను విడుదల చేసినట్టు తెలిపారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వార్షికోత్సవం

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పామూరులోని విరాట్‌నగర్ కాలనీలో గల శ్రీగోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416 జయంతి, దేవస్థాన 11వ వార్షికోత్సవం, కార్తీక వనభోజనాల కార్యక్రమాలను బుధవారం నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు, మహానివేదిక, భక్తులకు అన్నదానం, సాయంత్రం అర్చనలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

జీపీడీపీ శిక్షణకు ప్రజాప్రతినిధుల గైర్హాజరు

- అధికారులు సమాచారం ఇవ్వలేదని ఆవేదన



శిక్షణ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

తాళ్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక కోసం ఒకరోజు జరిగిన శిక్షణ కార్యక్రమానికి అధికారులు సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ, జడ్పీటీసీ, పలువురు ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఉన్నట్టు మండలస్థాయి అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవటంతో కార్యక్రమానికి హాజరుకానట్లు సమచారం.

గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసేందుకు ప్రజాప్రతినిధులకు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. వీరికి అధికారులు సమాచారం ఇవ్వక పోవటంతో శిక్షణకు డుమ్మాకొట్టారు. జడ్పీటీసీ, మండల కోఆప్షన్ సభ్యులు, పలు సర్పంచ్‌లు ఎంపీపీ చాంబర్‌లోనే ఉండి, తమకు సముచిత గుర్తింపు లేనందున శిక్షణకు గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం, మల్కాపురం, విఠలాపురం, తురకపాలెం, మన్నేపల్లి, మాధవరం పంచాయతీలకు శిక్షణ జరగాల్సి ఉంది. కొర్రపాటివారిపాలెం సర్పంచ్ ఒక్కరే హాజరుకావటంతో 11.30 గంటకు శిక్షణ ప్రారంభించారు. మధ్యాహ్నం తూర్పుగంగవరం, బెల్లకొండవారిపాలెం, దోసకాయలపాడు, లక్కవరం, రామభద్రాపురం, నాగంబొట్లపాలెం, వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు పంచాయతీలకు శిక్షణ జరగగా, కేవలం నలుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టగా అధికారుల్లో మాత్రం తగినంత స్పందన ఉండటంలేదని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. శిక్షణ గురించి స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులకు సక్రమంగా సమాచారం ఇవ్వక పోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్థాయినుంచి మండల స్థాయి అధికారుల వరకు చులకనగా చూస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు మండల స్థాయి అధికారులు మినహా ఎవరూ శిక్షణలో పాల్గొనలేదు. కాగా నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణకు ఎంపీడీవో ఒంగోలు వెళ్లినట్లు తెలిసింది.

ఘనంగా మాగుంట రాఘవరెడ్డి జన్మదినం



దొనకొండ: రాఘవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పేదలకు దుప్పట్లు, సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా మాగుంట రాఘవరెడ్డి అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల్లో గుర్తింపు పొందారని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆయన్న జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా నాయకులు శృంగారపు నాగసుబ్బారెడ్డి, కొత్తం రఘునాథరెడ్డి వందమంది పేదలకు సమకూర్చిన దుప్పట్లు, బియ్యం, కందిపప్పు, కూరగాయలను పంపిణీ చేశారు. భారీ కేకు కట్ చేశారు. ప్రజలకు కేకు, స్వీట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొమ్మతోటి సుబ్బారావు, యగ్గేని యల్లారెడ్డి, షేక్ తౌహీద్, కుందుర్తి లక్ష్మణ్, బండ్లా వెంకటనారాయణ, పెమ్మసాని లక్ష్మీనారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, చొప్పరపు మైకేల్‌బాబు, పత్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

దర్శి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను దర్శిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వీసీ రెడ్డి, పుల్లలచెరువు చిన్నా, కల్లూరి సుబ్బు తదితరులు కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. షిరిడి సాయి బాబా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గుర్రం బాలకృష్ణ, అంబటి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



తాళ్లూరు: తేజా వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేస్తున్న మాగుంట అభిమానులు

తాళ్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో గల తేజా వృద్ధాశ్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈసందర్భంగా పండ్లు, మిఠాయిలు వృద్ధులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో మాగుంట అభిమానులు, టీడీపీ నాయకులు ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, యత్తపు కాశిరెడ్డి, కొసనా గురుబ్రహ్మం, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గుజ్జుల సుబ్బారెడ్డి, శనివారపు కోటిరెడ్డి, కైపు రమణారెడ్డి, కార్తీక్, అంజిరెడ్డి, మేడగం సుబ్బారెడ్డి, సాని ఆంజనేయులు, ఇమ్మానియోల్, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో చిరుజల్లులు

కురిచేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మంగళవారం మండలంలో చిరుజల్లులు పడ్డాయి. గతంలో కురిసిన వర్షాలతో రైతులు నష్టపోయారు. ఇప్పటికే పొగాకు సాగుచేసిన రైతులు ఆకులు పండిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఈసారి కూడా భారీ వర్షాలు కురిస్తే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్రీడా సమ్మేళనంలో పాల్గొన్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర కళాశాలల క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక సమ్మేళనం వేడుకలు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడాపోటీలకు కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నారని బండారు రవీంద్రబాబు తెలిపారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పీసీపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జి.కోటయ్య హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తున్న 18 మద్యం బాటిళ్లను మంగళవారం ఆయన స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నారని సమాచారం అందడంతో తనిఖీ చేసినట్టు చెప్పారు. పీసీపల్లిలోని పవర్ ఆఫీస్ వద్ద అలీసాహెబ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేసినట్టు చెప్పారు. అతనివద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలించినా, బెల్టుషాపులు నిర్వహించినా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

పీసీపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మంగళవారం పీసీపల్లిలోని రైతుసేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువకాలం పొగాకు సాగుచేయడం వల్ల భూమిలోని పోషకాలు తగ్గుతాయన్నారు. పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయంగా మినుము, శనగ పంటలను సాగుచేయాలని సూచించారు. పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కొంతకాలంగా పొగాకు ధర ఎక్కువగా పలుకుతున్నందున రైతులు అధికంగా సాగు చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలలో కూడా పొగాకు సాగు ఎక్కువైనందున రాబోయేకాలంలో ధర స్థిరంగా ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

వెలిగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్య త్వంతో కార్యకర్తలకు గుర్తింపు, భరోసా ఉంటుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాళ్ళపల్లి పంచాయతీలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 70 లక్షల సభ్యత్వంతో బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. యువనేత నారా లోకేష్ సరికొత్తగా ఆలోచించి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో గవదకట్ల హరికృష్ణ, గోనా ప్రతాప్, పిన్నిక బాలకోటయ్య, గురవయ్య, గవదకట్ల మాలకొండయ్య పాల్గొన్నారు.

రబీ పంటలకు ఈక్రాప్ చేసుకోవాలి


వెలిగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన పంటలకు ఈక్రాప్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.రంగాకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఇమ్మడిచెరువు, కోటాలపల్లి, గ్రామాల్లో జరుగుతున్నా పంట నమోదును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వేముల శ్రీనును ఒంగోలు ఈఎస్‌టీఎఫ్ ఎస్‌ఐ రవి, ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకు న్నట్టు దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు తెలి పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కనిగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని నారపరెడ్డిపల్లి గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. రాయచోటి నుంచి విజయవాడకు ట్రావెల్స్ బస్సు వెళుతుంది. ఈక్రమంలో ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తూ ఒక్కసారిగా రోడ్డుపైకి వెళ్ళాడు. ట్రావెల్ బస్సు డ్రైవర్ అదుపుచేయలేక ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డుపై పడిపోయాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఈ ప్రాంతానికి చెందిన వాడు కాదని, యూపీ ప్రాంత వాసిగా తెలుస్తుందని ఎస్‌ఐ తెలిపారు. గ్రానైట్ క్వారీలు, రెస్టారెంట్‌లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు వచ్చినవారిగా భావించి విచారిస్తున్నామని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



రికార్డుల మాయం

1 డీపీవో కార్యాలయంలో రగడ

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామపంచాయతీ అధికారి కార్యాలయంలో రికార్డుల మాయంపై రగడ జరుగుతున్నది. జిల్లా కేంద్రంగా బాపట్ల ఏర్పడిన తర్వాత జిల్లాపంచాయతీ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు చెరుకుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కేవీ సురేష్‌ను డిప్యూటేషన్‌పై నియమించారు. ఆయనను ఇటీవల భట్టిప్రోలు మండలం పెదపులివర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. అయితే సిబ్బంది కొరత ఉన్నందున సురేష్‌ను ఇక్కడే ఉంచాలని అధికారులు సిఫార్సు చేశారు. దీంతో ఆయన పెదపులివర్రు స్కూల్‌లో జాయిన్ అయి మరలా డిప్యూటేషన్ మీద వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా గత నెల 26న సురేష్‌కు సంబంధించిన కప్‌బోర్డు తాళాలను పగలగొట్టి అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరావు పలు రికార్డులు తీసుకెళ్లాడని తోటి ఉద్యోగులు చెప్పారు. దీంతో సురేష్ వచ్చి రికార్డులు మాయం కావడంపై జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావుకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. గ్రామపంచాయతీ గ్రేడ్-5, గ్రేడ్-6, గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు, బిల్‌కలెక్టర్‌లు, స్వీపర్లకు సంబంధించిన ఫైళ్లను తీశారన్నారు. కాగా ఈవిషయమై డీపీవో ప్రభాకరరావును వివరణ కోరగా ఫైళ్ళ మాయంపై వివరణ ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటేశ్వరరావుకు మెమో ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు మధ్య తలెత్తిన ఈ వివాదంపై కలెక్టరేట్‌లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది.

..రయ్‌రయ్



పూర్తయిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డు

సర్వాంగ సుందరంగా.. అధునాతనంగా.. ఆహ్లాదకరంగా.. రక్షణాత్మకంగా.. పర్యావరణహితంగా.. చిలకలూరిపేట బైపాస్ అందుబాటులోకి వచ్చేసింది. ఎన్నో ఏళ్లుగా.. చిలకలూరిపేటవాసుల కలగా.. చిలకలూరిపేట మీదగా రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడే వారి కష్టాలను తీరుస్తూ ఎట్టకేలకు బైపాస్ నిర్మాణం జరిగింది. 16వ నంబరు జాతీయ రహదారిపై గుంటూరు, ఒంగోలు మధ్య చిలకలూరిపేట పట్టణాన్ని బైపాస్ చేస్తూ సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో 16.384 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మాణం చేశారు. దేశంలోనే మొదటిసారిగా మోడల్ బైపాస్‌గా రూపొందించిన ఈ రోడ్డుపై వాహనదారులు రయ్‌రయ్‌మంటూ త్వరలో ప్రయాణించనున్నారు. ఎన్నో ప్రత్యేకతలతో నిర్మాణం జరిగిన బైపాస్‌ను ఈ నెలాఖరుకు ప్రారంభించే అవకాశం ఉంది.

- సుందరంగా చిలకలూరిపేట బైపాస్
- దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డు
- ఈ నెలాఖరులో ప్రారంభించడానికి సన్నాహాలు
- చిలకలూరిపేటకు మణిహారంగా రోడ్డు నిర్మాణం

బైపాస్ రోడ్డు ప్రత్యేకతలు

- చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం.
- గణపవరం వద్ద విశాలమైన ప్రదేశంలో రెండు చోట్ల ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు.
- రోడ్డు పొడవునా ఒకవైపున ట్రీ గార్డులతో 3,500 మొక్కలను నాటుతున్నారు. డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.
- బైపాస్ రోడ్డులో అత్యంత అధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు చేశారు.
- ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వాహనదారులకు సుమారు 30 నిమిషాల సమయం ఆదా.
- మొత్తం మూడు ఫ్లై ఓవర్లు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణం

చిలకలూరిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎన్నో సవాళ్లు.. మరెన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు చిలకలూరిపేట బైపాస్ రహదారి అందుబాటులోకి వచ్చేసింది. జాతీయ రహదారిపై మార్టూరు గుంటూరు మధ్య రామచంద్రాపురం వద్ద ప్రారంభమై తిమ్మాపురం గ్రామం వరకు నిర్మాణం జరిగింది. బైపాస్ రోడ్డు భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు ఖర్చు చేయగా, రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. సర్వాంగ సుందరంగా, వాహనదారులకు ఇబ్బంది లేని రీతిలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో ఓగేరు, కుప్పగంజి వాగులపై రెండు వంతెనలను నిర్మించారు. ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బొప్పూడి (మిగతా 6లో)



1. సర్వీస్ రోడ్ పక్కన నిర్మించిన బస్సు షెల్టర్
2. నరసరావుపేట మార్గంలో నిర్మించిన అండర్ పాస్
3. బైపాస్ పక్కన ఏర్పాటుచేసిన సోలార్ వ్యవస్థ

చీఫ్‌విప్‌గా జీవీ

- ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- ఆంజనేయులు కష్టానికి దక్కిన ఫలితం
- ఎట్టకేలకు పల్నాడు జిల్లాకు కీలక పదవి



నరసరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ చీఫ్‌విప్‌గా వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మంత్రివర్గంలో ఇటు గుంటూరు నుంచి ఇద్దరికి, అటు బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు వరించాయి. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవికి కూడా దక్కలేదు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాకు ఎట్టకేలకు కీలక పదవి దక్కింది. వినుకొండ నుంచి గోనుగుంట్ల వెంకట శివ సీతారామాంజనేయులు(జీవీ) మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రతిపక్షంలో ఐదేళ్ల పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఈక్రమంలో ఆయన కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. జీవీకి మంత్రి పదవి వస్తుందని జిల్లా పార్టీ వర్గాలు భావించాయి. అయితే మంత్రివర్గ కూర్పులో కులాల సమీకరణల కారణంగా జీవీకి మంత్రి పదవి దక్కలేదు. ఈ పరిస్థితుల్లో (మిగతా 6లో)

అసభ్యకర పోస్టులపై కేసులు?

- డీజీపీ, ఐజీని ట్యాగ్ చేస్తూ గతంలో పోస్టులు
- ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 29 కేసులు నమోదు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో విశృంఖలంగా వ్యవహరిస్తున్న వారిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో 29 కేసులు నమోదైన సంగతి తెలిసిందే. అదే సోషల్ మీడియా వేదికగా గతంలో వైసీపీ శ్రేణులు పెట్టిన అసభ్యకర పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలతో వ్యక్తిత్వ హననం చేసిన చిత్రాలను నేరుగా డీజీపీ, ఐజీకి పలువురు ట్యాగ్ చేశారు. జిల్లాకు చెందిన దాదాపు 17 మంది ట్యాగ్ చేసినట్లు తెలుస్తోంది. ఐటీ వింగ్ దృష్టి పెట్టి వివరాలు సేకరిస్తోంది. ఇలా ట్యాగ్ చేసిన పోస్టులు గతంలో ఏ ఐపీ అడ్రస్ నుంచి వచ్చాయో కూడా పోలీస్ శాఖ జల్లెడపడుతోంది. ఇలా ట్యాగ్ చేసిన వాటిలో దారుణంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడిన పోస్టులు కూడా ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పోలీస్ శాఖ చెబుతోంది. ఒకవేళ ఎవరైతే ట్యాగ్ చేశారో వారిని సంప్రదించి, వారు ఫిర్యాదు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే ఐపీ అడ్రస్ ఆధారంగా అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కేసుల నమోదుకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది.

త్వరలోనే నిందితుల అరెస్టు..

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే నమోదైన 29 సోషల్ మీడియా కేసులకు సంబంధించి శాఖాపరమైన విచారణ జరుగుతోంది. ఇందులో తీవ్రత ఎక్కువగా ఉన్న వాటిని 17గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీటికి సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చడానికి పోలీస్‌శాఖ సిద్ధమవుతోంది.

సహకార.. ఎన్నికలేనా?

- ఎన్నికలపై ఆసక్తి చూపని ప్రభుత్వం
- త్రి సభ్య కమిటీల కొనసాగింపునకు కసరత్తు
- ఐదేళ్లుగా అధికారుల చేతిలో సొసైటీల నిర్వహణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. అయితే ఇందుకు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచే నిర్ణయాలతో సరిపెట్టింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమిస్తూ కాలయాపన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి

2019 నుంచి అధికారుల చేతుల్లోనే సొసైటీలు

సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2018లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో ప్రత్యేక పాలన ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలలకొకసారి త్రి సభ్య కమిటీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది.



జొన్నలగడ్డ సొసైటీ భవనం

వచ్చిన తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని రైతులు ఆశించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం నియమించిన త్రి సభ్య కమిటీలు రాజీనామా చేశాయి. అయితే సొసైటీల ఎన్నికలను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కూడా ఆసక్తి చూపడంలేదన్న వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. ఈ మేరకు కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సమాచారం. సొసైటీల ఎన్నికలకు సంబంధించి సభ్యులను గుర్తించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు ప్రత్యేక పాలన కొనసాగించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు సహకార వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొంత కాలం ఎన్నికలు వాయిదా పడినట్లేనన్న ప్రచారం జరుగుతోంది. సొసైటీల నిర్వహణ ప్రస్తుతం అధికారుల చేతిలో ఉంది. ముగ్గురు, లేదా ఐదుగురు అధికారులను సొసైటీలకు నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ముగ్గురా.. ఐదుగురా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

ఇష్టారాజ్యంగా కమిటీలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయన్న విమర్శలున్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించుకున్నాయి. కొన్ని త్రి సభ్య కమిటీలు ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆయా నియామకాలకు పాత తేదీలను నమోదు చేసుకుని మినిట్స్ రాసుకున్నట్లు సమాచారం. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు పలు అక్రమాలకు పాల్పడ్డాయన్న విమర్శలున్నాయి. పంట రుణాలు మంజూరులో కూడా రాజకీయంగా కమిటీలు ఇబ్బందులకు గురిచేసినట్లు రైతులు వాపోతున్నారు.

యార్డుకు.. లక్షన్నర టిక్కీలు

- క్వింటాల్‌కు రూ.1500 తగ్గిన ధర
- మిర్చి విక్రయానికి పోటీపడుతోన్న రైతులు
- కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రాక
- 50 వేల టిక్కీలకే ఈనామ్‌లో బిడ్డింగ్ అవకాశం



గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి కొత్త పంట రాక ప్రారంభం అవుతుండగా.. కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసిన టిక్కీలను విక్రయించేందుకు రైతులు పోటీ పడుతున్నారు. ఈ రెండు నెలల్లో విక్రయించుకోలేకపోతే జనవరి నుంచి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చే కొత్త పంటతో ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తూ ప్రస్తుత అన్‌సీజన్‌లో రోజుకు లక్షన్నర టిక్కీల శాంపిల్స్‌ని విక్రయానికి పెడుతున్నారు. ఎగుమతుల డిమాండ్ లేకపోవడంతో కనీసం 50 శాతం టిక్కీలు కూడా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో ధర నేలచూపులు చూడటం ప్రారంభించింది. కొద్ది రోజుల నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచే కాకుండా కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి మిర్చి టిక్కీలను తీసుకొస్తున్నారు. అన్ సీజన్‌లో రైతులు కేవలం శాంపిల్స్ మాత్రమే తీసుకొస్తారు. ఆయా శాంపిల్స్‌కు సంబంధించిన లాట్స్‌లో ఎన్ని టిక్కీలు ఉన్నాయో పేర్కొంటారు. ఆ విధంగా చూసుకుంటే రోజుకు 1.50 లక్షల టిక్కీలకు సంబంధించిన శాంపిల్స్ పెడుతున్నారు. అన్ సీజన్‌లో ఇంత భారీగా మిర్చి టిక్కీలను విక్రయానికి పెట్టిన దాఖలాలు గతంలో లేవు. ఈ కారణంతో మేలిమి రకాలు నెల క్రితం క్వింటాల్ రూ.18500 దాటగా నేడు రూ.1500లకు పైగా తగ్గాయి. మంగళవారం గుంటూరు మిర్చియార్డులో తేజ వెరైటీ క్వింటాల్ రూ.16500, ఆర్మూరు, బ్యాడిగి రకాలు రూ.12500, 334 రకం రూ.13 వేలు ధర మాత్రమే లభించింది.

క్షీణించిన ఎగుమతులు

బంగ్లాదేశ్, చైనా దేశాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. బంగ్లాదేశ్‌లో కొత్త పంట మార్కెట్‌ని ముంచెత్తడంతో దాని ప్రభావం తేజపై పడింది. చైనాలోనూ కొత్త పంట వచ్చిన కారణంగా ఆ దేశ దిగుమతిదారులు ఆర్డర్స్ పెట్టడం లేదు. మిర్చియార్డులో ఎక్స్‌పోర్టు వెరైటీలుగా తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు గుర్తింపు ఉన్నది. మిగతా రకాలన్నీ కారం తయారీకి వినియోగిస్తారు. అలాంటిది ఇప్పుడు తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు జరగడం లేదు. శీతల గిడ్డంగుల్లో నేటికీ 35 లక్షల మిర్చి టిక్కీల వరకు నిల్వ ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాల సమాచారం. కర్ణాటక, నంద్యాల నుంచి రోజుకు వెయ్యికి పైగా కొత్త మిర్చి పంట టిక్కీలు వస్తున్నాయి. వీటి వల్ల కోల్డ్‌స్టోరేజ్‌లలోని నిల్వలు నెమ్మదిగా తగ్గుతున్నాయి. మరో రెండు నెలల పాటు రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీల విక్రయం జరిగితేనే కోల్డ్‌స్టోరేజ్‌లు ఖాళీ అవుతాయి. కాగా ప్రస్తుతం నిల్వ ఉన్న టిక్కీలలో 15 లక్షల టిక్కీల వరకు తాలుకాయలు ఉన్నట్లు సమాచారం.



వివరాలను వెల్లడిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

నేడు వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ (కె) కాకినాడ వారి ఇంటర్ కాలేజీ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్, యూనివర్సిటీ టీం ఎంపిక మంగళవారం జరుగుతుందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు వివరాలను వెల్లడించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావులు తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

అభివృద్ధి ప్రణాళికపై దృష్టి సారించండి

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక దృష్టిసారించాలని వేటపాలెం ఇన్‌చార్జి ఎంపీడీవో శివసుబ్రహ్మణ్య శర్మ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమావేశం హాలులో రెండు మండలాలకు సంబంధించి జీపీడీపీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాల అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రణాళిక ఆధారంగానే నిధులు అందుతాయని వివరించారు. గ్రామ పంచాయతీ ప్రణాళిక అందించాల్సిన చివరితేదీ జనవరి 31 అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్‌ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు రెండు మండలాల పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సంతమాగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజు వివిధ రకాల ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ప్రతిభ చూపిన వారికి ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తారని తెలిపారు.

17న యద్దనపూడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

యద్దనపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఈనెల 17వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. యద్దనపూడిలోని జడ్పీ హైస్కూల్‌లో ఈ శిబిరం జరుగుతుందని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం మంగళవారం ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వారిలో అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడానికి ఎంపికచేస్తారన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని క్యాంపు కార్యాలయం వారు తెలిపారు.

సుడి దోమపై అప్రమత్తం

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరిలో సుడి దోమను గమనించి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో వరి పైరును ఆయన పరిశీలించారు. అక్కడక్కడా సుడి దోమను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వాతావరణం సుడి దోమకు అనుకూలమని, దుబ్బుకు ఈనిక దశలో 20 నుంచి 25 దోమలను గమినించిన రైతులు వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వేప నూనె 1500 పీపీఎం లీటరు నీటికి 5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లీటర్ నీటికి లేదా ఎథిప్రోల్ 0.25 ఎంఎల్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రబీ ఈ పంట నమోదు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతుందని వరి, మొక్కజొన్న, శనగ, మినుము సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో బధిరులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. సీనియర్ రోటేరియన్, వ్యాపారులు బిజ్జం వెంకట కృష్ణారెడ్డి (బీవీ కృష్ణారెడ్డి) పుట్టిన రోజు సందర్భంగా బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్లబ్ సభ్యులు కేక్‌ను కట్ చేసి, బీవీని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, వై. రమేష్‌బాబు, సురేంద్రబాబు, సుబ్బారావు, లేవి ప్రసాద్, ప్రిన్సిపాల్ సురేంద్ర, నిర్వహకులు ఆరోగ్యం, భువనేశ్వరి, అంజాద్ బాషా పాల్గొన్నారు.

అపార్ కార్డుల జారీకి ప్రత్యేక కేంద్రం



ప్రత్యేక కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు అపార్ కార్డుల జారీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ప్రతి విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపీ డీవో పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా

ప్రైవేటు బస్ డ్రైవర్ మృతి

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పడుకున్న ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా కావడంతో ప్రైవేటు బస్ డ్రైవర్ అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల మండల పరిధిలోని కీర్తివారి పాలెంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మసనం గోవిందు (40), రమణ దంపతులు. వీరికి 19, 18 వయస్సున్న ఇద్దరు కుమారులున్నారు. ఇతను వ్యవసాయం చేసుకుంటూ, ప్రైవేటు స్కూల్ బస్‌కు డ్రైవర్‌గా ఉన్నాడు. ఇంటి ఆవరణలో టేబుల్ ఫ్యాన్ మంచం వద్ద పెట్టుకుని పడుకున్నాడు. ఫ్యాను వైరు మంచం కాళ్ల కిందపడింది. ఇనుప మంచం కావడంతో విద్యుత్ సరఫరా అయి కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని రోదించారు.

కమిషనర్‌గారూ ఈ పొగ మాటేంటి

- కాగితాల్లో పరిశుభ్రం.. క్షేత్రస్థాయిలో కంపు
- ఏర్పాటు లక్ష్యం ఘనం.. నిర్వహణ లోపభూయిష్టం
- రూ.5 కోట్లు బూడిదలో పోసిన పన్నీరులా నిర్వహణ

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటోల్లో ఉన్నది రామాపురం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో పరిస్థితులు. అయితే ఇక్కడ చెత్తను తగులబెట్టడం లేదని అధికారులు చెప్పడం అందరినీ విస్మయం కలిగిస్తోంది. గుంటూరు తరలిస్తున్నామని చెప్తున్నారు. అయితే ఆ ప్రక్రియ ఎప్పుడో ఆపేశారు. దీనిపై ఏలికలు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



తగులబెట్టిన చెత్త నుంచి వస్తున్న పొగ



మూలనపడ్డ కొబ్బరి బొండాల ప్రాసెసింగ్ మిషన్

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెం ట్ యూనిట్‌ను

వేటపాలెం మండలం రామాపురంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. 2007లో పనులు ప్రారంభించి 2010లో ప్రారంభించారు. చీరాల మున్సిపల్ పరిధిలో వచ్చే చెత్తను అక్కడకు తరలిస్తారు. తడి, పొడిచెత్త వేరు చేస్తారు. చెత్త నుంచి సంపదను సృష్టించాలి. ఇదీ లక్ష్యం. అందుకు సంబంధించి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధుల బృందం ఆ యూనిట్‌కు వచ్చింది. దీన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా ఉండే విధంగా చర్యలు చేపడతామని అప్పటి నేతలు చెప్పారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలను కూడా పండించారు. వర్మీ కంపోస్టుగా కొంత ఆదాయం కూడా తీశారు. తరువాత ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారారు. ఈ క్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కాస్త ప్రస్తుతం డంపింగ్ యార్డుగా తయారయింది. అక్కడ ఉన్న వివిధ రకాల యంత్రాలు మూలనపడ్డాయి.

కాగితాల్లో పరిశుభ్రం ... క్షేత్రస్థాయిలో మాత్రం కంపుగా ఆ డంపింగ్ యార్డు మారింది. అందులో చెత్తను తగులబెట్టి కాలుష్యాన్ని పెంచి పోషిస్తున్నారు. అయితే అక్కడ చెత్తను తగులబెట్టడం లేదని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొత్తగా వచ్చిన ఆయన క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తే వాస్తవాలు తెలుసుకోవచ్చు. పాలకులు, అధికారులు కలసి పరిశీలన చేస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. అందుకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ, యూనిట్ ఏర్పాటు లక్ష్యసాధనకు చర్యలు చేపట్టవచ్చు. అందుకు అనుగుణంగా పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.



మూలనపడ్డ సర్జికల్ వేస్ట్ యంత్రపరికరాలు

అద్దంకి నుంచి దూరమైన ఉపాధి కార్యాలయం

- క్లస్టర్‌ను రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం
- ఆ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు
- జిల్లాలో 2 చోట్ల మాత్రమే ఏపీడీ కార్యాలయాలు
- చీరాల క్లస్టర్‌కు ఇన్‌చార్జి అధికారే దిక్కు
- ఇక పర్యవేక్షణ ఎలా

అద్దంకి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో రెగ్యులర్‌గా జరిగే ఉపాధి హామీ పథకం పనులు కూడా ఉన్నాయి. అయితే పర్యవేక్షణకు అధికారులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తరువాత జిల్లాలో బాపట్లతో పాటు చీరాల, అద్దంకి క్లస్టర్‌లు ఉన్నాయి. అయితే గత రెండున్నర సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వం అద్దంకిలో ఉన్న క్లస్టర్‌ను రద్దు చేసి మార్టూరు కేంద్రంగా ఉన్న చీరాల క్లస్టర్‌లో కలిపారు. దీంతో బాపట్ల జిల్లాలో రెండు క్లస్టర్‌లు మాత్రమే ఉన్నాయి. చీరాల క్లస్టర్ పరిధిలో అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలోని 13 మండలాలు ఉన్నాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాలలో కూలీల లభ్యత ఎక్కువగా ఉండడంతో ఉపాధి పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 80 కోట్ల రూపాయల ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు మంజూరు అయ్యాయి. ఆ పనులన్నీ ఉపాధి హామీ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే చీరాల క్లస్టర్‌కు రెగ్యులర్ ఏపీడీ కూడా లేరు. దీంతో ఏపీవోను ఇన్‌చార్జి ఏపీడీగా నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేసిన అద్దంకి క్లస్టర్‌ను తిరిగి పునరుద్ధరించడం ద్వారా అద్దంకి నియోజకవర్గం పరిధిలో జరిగే పనుల పర్యవేక్షణ సులువుగా మారే అవకాశం ఉంది. చీరాల, పర్చూరు నియోజకవర్గాల మండలాలు ఒక క్లస్టర్‌గా, అద్దంకి నియోజకవర్గంలోని మండలాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని, అదే సమయంలో రెగ్యులర్ ఏపీడీని నియమించాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి అద్దంకిలో క్లస్టర్ ఏర్పాటుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రయ్‌రయ్

(5వ పేజీ తరువాయి)

పురుషోత్తమపట్నం, చిలకలూరిపేట, గణపవరం, నాదెండ్ల వద్ద అండర్ పాస్‌ల నిర్మాణం చేశారు. బొప్పూడి, కోటప్పకొండ, గణపవరం, నాదెండ్ల ప్రాంతాల్లో 8 బస్ షెల్టర్లు నిర్మించారు. రోడ్డుకు ఒకవైపున ప్రధాన సర్వీస్ రోడ్డు ఉంటుంది. అండర్ పాస్‌ల వద్ద రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు 15 సంవత్సరాల పాటు ఈ రోడ్డు నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం చేశారు. పశువులు రోడ్డుపైకి రాకుండా ఉండడానికి, ఆక్రమణలను అరికట్టడానికి, ప్రమాదాల నివారణకు ఈ గోడను నిర్మించారు. రోడ్డు పక్కన గణపవరం వద్ద హైవేస్‌కు చెందిన విశాలమైన ప్రదేశం రెండు చోట్ల ఉంది. దీంతో దానిని సద్వినియోగం చేసుకునేందుకు ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సోలార్ ప్లేట్లను బిగిస్తున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పగటి వేళలో గ్రిడ్‌కు అనుసంధానం చేసి, రాత్రిళ్లు రోడ్డుపై లైట్ల వెలుగులకు వినియోగించనున్నారు. బైపాస్ రోడ్డు పొడవునా ఒక వైపున 3,500 మొక్కలను నాటుతున్నారు. వాటిలో గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్ ఫామ్ జాతుల మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్కకు ట్రీ గార్డును ఏర్పాటు చేస్తున్నారు. వీటికి నిత్యం నీటిని అందించి సంరక్షించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కాగితం పూల మొక్కలను



రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన గోడ

నాటారు.

నాణ్యతా ప్రమాణాల తనిఖీలు

రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినట్లుగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ కాంట్రాక్టర్లు నేషనల్ హైవే సంస్థకు నివేదించారు. దీంతో హైవేస్ అధికారులు పనుల నాణ్యతా ప్రమాణాల పరిశీలన చేస్తున్నారు. పరిశీలన అనంతరం రోడ్డు ప్రారంభోత్సవానికి పచ్చజెండా ఊపుతారు. ఇప్పటికే నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం ఆధ్వర్యంలో రోడ్డు తనిఖీ జరిగింది. బైపాస్ రోడ్డులో అత్యంత ఆధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు జరిగింది. వాహనాల వేగంపై కన్నేసి ఉంచేందుకు ప్రత్యేక పరికరాలు బిగించారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్గేట్ వద్దకు చేరే విధంగా ఏర్పాటు జరిగింది.

టోల్‌గేట్‌లేని మార్గంగా బైపాస్

చిలకలూరిపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయినా ఈ మార్గంలో టోల్‌గేట్ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వ్యయాన్ని రాబట్టుకోవడానికి గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్ద రేట్లను పెంచవచ్చని సమాచారం.

పేట ప్రజలకు తప్పిన తిప్పలు

బైపాస్ రోడ్డుపై అధికారికంగా రాకపోకలకు అనుమతిస్తే చిలకలూరిపేట ప్రజలకు ఊరట లభిస్తుంది. ప్రస్తుతం పట్టణం మధ్యగా వెళ్లే జాతీయ రహదారిపై మూడు ప్రధాన సెంటర్లలో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. దీనివల్ల ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణించేవారికి సుమారు 30 నిమిషాల సమయం వృథా అవుతున్నది. పట్టణ ప్రజలు రోడ్డు దాటి వెళ్లాలంటే కనీసం 20 నిమిషాలు పడుతున్నది. తరచూ ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోతున్నారు. బైపాస్ రోడ్డును ప్రారంభిస్తే అధిక శాతం వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. కాలుష్యం సమస్యకు కూడా తెరపడుతుంది.

చీఫ్ విప్‌గా జీవీ

(5వ పేజీ తరువాయి)

చీఫ్‌విప్ పదవితో పార్టీ అధిష్ఠానం జీవీకి సముచిత స్థానం కల్పించింది. 2009, 2014లో జీవీ వినుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాకు టీడీపీ అధ్యక్షుడిగా దాదాపు పదేళ్లు బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో టీడీపీ సభ్యత్వ నమోదులో జీవీ పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపి అధిష్ఠానం మన్ననలు పొందారు. ఇక ఆయన ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి అనేక పోరాటాలు చేశారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో శావల్యాపురం జడ్పీటీసీని గెలిపించి ప్రతిపక్షంలో కూడా ఆయన సత్తా చాటారు. జీవీకి పదవి దక్కడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పలువురు నేతలు జీవీని సత్కరించి ఆయనకు అభినందనలు తెలిపారు.

సమర్థవంతంగా నిర్వహిస్తా : జీవీ

చీఫ్‌విప్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు జీవీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. సహచర ఎమ్మెల్యేలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానన్నారు. శాసన సభ విలువలు గౌరవం పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వినుకొండకు రెండోసారి పదవి

వినుకొండ నియోజకవర్గానికి రెండో సారి చీఫ్‌విప్ పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వినుకొండ నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా గెలిచిన నన్నపనేని రాజకుమారి చీఫ్‌విప్‌గా పని చేశారు. ఆ తర్వాత జీవీని ఆ పదవి వరించింది.

87 మందికి వైద్య పరీక్షలు

అద్దంకిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులు వలన వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండి ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ మనోజ్, డాక్టర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం, ఇతర రుగ్మతలతో బాధపడుతున్న 87 మందిని పరీక్షించి మందులను అందజేశారు. గ్రామంలో ఆశాలు, ఏఎన్‌ఎంలు జ్వర పీడితుల సర్వే నిర్వహించిన నేపథ్యంలో రోగులను పరీక్షించి పలు సూచనలు చేసి, మందులను అందజేశారు. గ్రామంలో వాటర్ ప్లాంట్‌లను పరిశీలించి తాగునీటి నాణ్యతాప్రమాణాలను పరీక్షించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రణాళికను రూపొందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మనోజ్

కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మక్బూల్‌జాని, సర్వేపల్లి తబిత, కుమార్, ఏఎన్‌ఎంలు పుష్పలీల, ఎంఎల్‌హెచ్‌పీ షరీఫా, ఆశాలు అంజలి, నాగలక్ష్మి, అమేంద్ర 104 సిబ్బంది మణికంఠ, ఉదయ్ పాల్గొన్నారు.

ముఖాముఖి

నేర పరిశోధనలో అందరూ సమానమే

డీఎస్పీ మహ్మద్ మొయిన్



నేర పరిశోధనలో అందరూ సమానమే. చట్టపరిరక్షణలో భాగంగా నిబంధనలు అతిక్రమిస్తే ఎవరికైనా చర్యలు తప్పవు. చీరాల సబ్‌డివిజన్‌లో గతంలో పలు ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉంది. డీఎస్పీగా చీరాల తొలి పోస్టింగ్. తోటి అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో విధి నిర్వహణ పారదర్శకంగా కొనసాగిస్తానని ఆంధ్రజ్యోతి ప్రతినిధి అడిగిన ప్రశ్నలకు డీఎస్పీ మహ్మద్ మొయిన్ నమ్మకంగా బదులిచ్చారు.

- చీరాల సబ్ డివిజన్‌లో గతంలో మీరు పనిచేశారా?

డీఎస్పీ : ఇంకొల్లు, మార్టూరులో ఎస్‌ఐగా పనిచేశాను. అద్దంకి, పర్చూరు, చినగంజాం స్టేషన్లలకు ఇన్‌చార్జి ఎస్‌ఐగా పనిచేశాను. చీరాల సబ్ డివిజన్‌పై మంచి అవగాహనే ఉంది.

- డీఎస్పీగా ఇది తొలి పోస్టింగ్ కదా.. దీనికి ముందు ఎక్కడ పనిచేశారు?

డీఎస్పీ : ఇక్కడకు ముందు దర్శి ఒంగోలు క్రైం, పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో సీఐగా విధులు నిర్వహించాను. డీఎస్పీగా ప్రమోషన్‌తో ఇక్కడకు వచ్చాను. డీఎస్పీగా ఇదే తొలి పోస్టింగ్.

- చీరాల ప్రాంతం సున్నితం, సమస్యాత్మకం అని రెండు కోణాల్లో చెప్పుకుంటారు. మీరెలా అధిగమిస్తారు?

డీఎస్పీ : సమస్యలు ఎక్కడైనా ఉంటాయి. అవి మనం చూసే కోణాన్ని బట్టి మారతాయి. తోటి అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, నేరప్రవృత్తి పెరగకుండా, నేరాలు నియంత్రించేందుకు పారదర్శకంగా అడుగులు వేస్తాం. మెరుగైన సేవలు అందించడమే అన్ని సమస్యలకు పరిష్కారం.

- వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అనుమానాస్పద మృతి కొంత రాజకీయ రంగు పులుముకుంది. ఆ కేసుకు సంబంధించి చార్జి షీట్ ఫైల్ చేశారా?

డీఎస్పీ : ఆ కేసుకు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్నాను. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ తదితర రిపోర్టులు రావాల్సి ఉంది. అవి వచ్చాక చార్జిషీట్ ఫైల్ చేస్తాం. కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తాం. సత్వర చర్యలు చేపడతాం. వాస్తవాలు వెల్లడిస్తాం.

- తీరప్రాంతంలో కొన్ని చోట్ల పర్యాటకుల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీఎస్పీ : అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా కఠినంగా వ్యవహరిస్తాం. రిసార్ట్స్, హోటల్స్ తదిరాలకు వచ్చే పర్యాటకులు భార్య, భర్త, కుటుంబ సభ్యులు అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారికే రూములు ఇవ్వాలని కచ్చితంగా చెప్తాం. పరిసరాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేస్తాం.

- ప్రజలకు మీరిచ్చే సూచన, నేరస్తులకు మీరు చేసే హెచ్చరిక?

డీఎస్పీ : నేర నియంత్రణలో ప్రజల సహకారం కీలకం. ప్రజలు కూడా యూనిఫాం లేని పోలీసులే. నేరస్తుల కదలికలను పోలీస్‌లకు తెలిపేందుకు ముందుకు రావాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. నేరాలకు పాల్పడే వారు ఎవరైనా ఉపేక్షించం.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు హేయం

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల డ్యూటీ డాక్టర్ వ్యాఖ్యలు హేయమని పలువురు జర్నలిస్టులు అన్నారు. సోమవారం వార్త సేకరణలో ఉన్న జర్నలిస్టుల పట్ల ఆమె దురుసుగా ప్రవర్తించారు. దీంతో మంగళవారం ఉదయం చీరాల జర్నలిస్టులు హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు డా.సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.

పడిపోయిన పాత విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం

మార్టూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నతాళి గ్రామంలో మంగళవారం ఉదయం శిథిలమైన విద్యుత్ స్తంభం రోడ్డుపై విరిగి పడిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. వాస్తవంగా శిథిల స్తంభం పడిపోయిన సమీపంలో రోడ్డు పక్కన అరుగులపై రోజు జనం పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటుంటారు. అంతే కాకుండా రోడ్డుపైన అడపాదడపా తిరుగుతూనే ఉంటారు. అయితే ఉదయం కరెంట్ స్తంభం విరిగి పడిన సమయంలో అరుగులమీద కానీ, రోడ్డుమీద కానీ జనం ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామానికి చెందిన శానంపూడి చైతన్య అనే యువకుడు ఈ విషయాన్ని మార్టూరు విద్యుత్ శాఖ ఏడీఏ సురేంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాడు. గతంలో కూడా సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ గ్రామంలోని శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని పలు సార్లు విద్యుత్ అధికారులను కోరారు. ఇదిలావుండగా సాయంత్రానికి విద్యుత్ అధికారులు స్పందించి గ్రామస్థుల సహకారంతో పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డుపై అడ్డంగా విరిగి పడిన విద్యుత్ స్తంభం

సకాలంలో వైద్యం చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం

- లక్ష్యంతో ముందుకు సాగుతున్న సిబ్బంది
- ఏరియా ఆసుపత్రికి పెరిగిన ఓపీలు
- వెంటాడుతున్న వైద్యులు, సిబ్బంది కొరత
- అందుబాటులో గుండెపోటుకు అత్యవసర ఇంజక్షన్
- కుక్కకాటుకు ప్రత్యేక మందులు
- రాజకీయ నాయకుల పరామర్శలతో కొంత ఇబ్బంది
- పని ఒత్తిడితో సతమతమవుతున్న వైద్యులు, సిబ్బంది
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం


చీరాల ఏరియా వైద్యశాల

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడే నిరుపేద, మధ్యతరగతి వారికి ఆరోగ్య ప్రదాయినులు ప్రభుత్వ వైద్యశాలలు. అందులో పనిచేసే వైద్యులు కనిపించే దేవుళ్లు. చీరాల ఏరియా వైద్యశాల కార్పొరేట్ హంగులతో సువిశాలంగా ఉంటుంది. రోజుకు సుమారు 500 ఓపీలు వస్తుంటారు. రోడ్డు ప్రమాదాలు, కొట్లాట కేసులు కూడా అను నిత్యం ఉంటూనే ఉంటాయి. ప్రమాదకరస్థితిలో వచ్చినవారికి సకాలంలో వైద్యం అందించి, వారి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో వైద్యులు, సిబ్బంది ఉరుకులు, పరుగులు తీస్తుంటారు. ఈక్రమంలో వారిని పరామర్శించేందుకు వచ్చే రాజకీయనాయకులు, బంధువులు, మీడియా కవరేజీ తదితర అంశాలతో కొన్ని సందర్భాల్లో వైద్యులు, సిబ్బంది ఒత్తిడికి గురవుతుంటారు. ఆ క్రమంలో ముందుగా వైద్యులు ప్రమాదంలో ఉన్నవారికి వైద్యం అందించేందుకు మిగిలినవారు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. అది స్వీయనియంత్రణతోనే సాధ్యం. ఇదిలావుంటే ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏరియా వైద్యశాలపై ప్రత్యేక దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో అరుదైన ఇంజక్షన్‌లు

ఏరియా వైద్యశాలలో గుండెపోటుతో వచ్చిన వారికి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఇంజక్షన్ (రూ.20వేలు విలువచేసే)లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది కాలంలో గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన 12 మందికి ఆ ఇంజక్షన్‌లను ఇచ్చారు. ఇంకా 7 ఇంజక్షన్లు అందుబాటుల ఉన్నాయి. కుక్కకాటుకు సంబంధించి రూ.3వేల విలువ చేసే ఇంజక్షన్‌లు, పాముకాటుకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

ఖరీదైన సీటీ స్కాన్, డయాలసిస్

ఏరియా వైద్యశాలలో ఖరీదైన సీటీ స్కాన్ అందుబాటులో ఉంది. ఇదే స్కాన్ ప్రైవేటుగా చేయించాలంటే ఒక్కో పేషెంట్‌కు రూ.2వేల వరకు ఖర్చవుతుంది. డయాలసిస్ కూడా అందుబాటులో ఉంది. డయాలసిస్ అవసరమైన పేషెంట్లు విడిగా ఆ వైద్యం పొందాలంటే పెద్ద మొత్తంలోనే అవుతుంది. ఆ సేవలను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నారు. అయితే డెంటల్ ఎక్స్‌రే మాత్రం అందుబాటులో లేదు.

వెంటాడుతున్న వైద్యులు, సిబ్బంది కొరత

ఏరియా వైద్యశాలలో రోగులను వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లుగా కొన్ని సందర్భాల్లో మెరుగైన వైద్య సేవలు అందించలేక, ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు. వివిధ విభాగాల్లో ఐదుగురు వైద్యుల అవసరం ఉంది. డిప్యుటేషన్ మీద తెనాలికి ఒకరు, ఒంగోలు రిమ్స్‌కు మరొకరిని పంపించారు. ఆర్ఎంఈవో పోస్టు ఖాళీగా ఉంది. పెరిగిన రోగుల సంఖ్యకు అనుగుణంగా నర్సుల సంఖ్య పూర్తిస్థాయిలో లేదు. ఖాళీలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

కొన్ని సందర్భాల్లో హడావుడితో ఒత్తిడికి గురవుతున్న వైద్యులు

నిత్యం రోడ్డు ప్రమాదాలు, కొట్లాట కేసుల ఏరియా వైద్యశాలకు వస్తూనే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఆయా క్షతగాత్రులను పరామర్శించేందుకు రాజకీయనాయకులు, మీడియా కవరేజీ, బంధువులు గణనీయంగా ఉండటంతో వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఒకింత ఒత్తిడికి గురవుతున్నారు. ఆయా సందర్భాల్లో ముందుగా వైద్యసేవలు అందించేవిధంగా ఆయా వర్గాలు సహకరించాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

అవుట్ పోస్టు పోలీసులు లేకుంటే నైట్ డ్యూటీ కష్టమే

ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందిలో ఓ వ్యక్తి రాత్రిళ్లు మద్యం సేవించి విధులకు హాజరువుతున్నారు. అతను మరికొందరిని గుంపు చేస్తున్నాడు. ఈ క్రమంలో అవుట్ పోస్టు పోలీసులు లేకుంటే నైట్ డ్యూటీ చేయడం కష్టమని ఆసుపత్రిలో పనిచేసే కొందరు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఆసుపత్రికి అపప్రద వచ్చే అవకాశం ఉంది.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే లక్ష్యం



రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే మా లక్ష్యం. అందుకు అనుగుణంగా పనిచేస్తున్నాం. రోజుకు సుమారు 500 నుంచి 700వరకు ఓపీలు వస్తున్నాయి. మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ప్రతి రోజు ప్రమాద కేసులు వస్తూనే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయస్థితిలో వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే క్రమంలోనే వైద్యుల ఆలోచనలు ఉంటాయి. మిగిలిన విషయాలు పట్టించుకోరు. దాన్ని అర్థం చేసుకుని సహకరించాలి. అప్పుడే సత్ఫలితాలు వస్తాయి. సిబ్బందిలో ఒకతను మద్యం సేవించి డ్యూటీకి వస్తున్నారు. తప్పు చేసిన వారిపై చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాను. ఈ క్రమంలో అవుట్ పోస్టు పోలీసులు అందించే రక్షణ ఎనలేనిది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఇటీవల జరిగింది. మెరుగైన చర్యలకు కార్యాచరణ జరుగుతోంది. అందరూ సహకరించాలని కోరుతున్నాం.

– డాక్టర్ సుభాషిణి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, చీరాల

సాగునీటి వనరుల అభివృద్ధికి చేయూతనివ్వాలి

మంత్రికి ఎమ్మెల్యే కొండయ్య విజ్ఞప్తి


మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలో ఉన్న సాగునీటి వనరుల అభివృద్ధికి చేయూతను ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంత్రి చాంబర్‌లో ఆయనను ఎమ్మెల్యే కొండయ్య కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న కొమ్మమూరు కాలువ, ఎత్తిపోతల పథకాలు, వాటి పనితీరు, వాటి అభివృద్ధికి అందించాల్సిన చేయూత తదితర అంశాలను ఎమ్మెల్యే కొండయ్య మంత్రికి వివరించారు. రైతుల ప్రయోజనాలతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఎమ్మెల్యే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందించారు.

విద్యుత్ సోలార్‌తో ప్రజలకు ప్రయోజనం


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు

ఎస్ఈ ఆంజనేయులు

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సోలార్ వినియోగంతో ప్రజలకు బిల్లు భారంతో పాటు పలు ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు అన్నారు. ముంతావారి సెంటర్‌లో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు, సోలార్ వెండర్స్, వినియోగదారులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో 34 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 2803 మీటర్ల తనిఖీలు చేసి 159 కేసులు నమోదు చేశారు. ఈక్రమంలోనే రూ.7.75 లక్షలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీఈఈ హరిప్రసాదరావు, రమేష్ బాబు, ఏఈలు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలి

ఆర్డీవో గ్లోరియా


నూతలపాడులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతం కాకుండా ఖాళీగా ఉన్న ప్రభుత్వం భూములను గుర్తించాలని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ల్యాండ్ బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఈవిషయంపై అధికారులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం మండలంలోని నూతలపాడు గ్రామంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. వాటి రికార్డులను తనిఖీ చేశారు. భూమి విస్తీర్ణం తదితర అంశాలను సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, వీఆర్వో శిరీష, సర్వేయర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో..

యద్దనపూడి : యద్దనపూడి మండలంలోని ప్రభుత్వ భూములను మంగళవారం ఆర్డీవో గ్లోరియా పరిశీలించారు. తహసీల్దార్ కే రవికుమార్ మండలంలోని యనమదల, పూనూరు, అనంతవరం, జాగర్లమూడి తదితర గ్రామాలలోని ప్రభుత్వ భూములను ఆర్‌డీవోకు చూపించారు. వాటిలో యనమదల గ్రామంలోని 16.40 ఎకరాల ప్రభుత్వ భూమిని, మిగిలిన గ్రామాలలోని కొన్ని ప్రభుత్వ భూములను గుర్తించారు. మండలంలో 40ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఇదిలావుండగా గన్నవరం గ్రామంలో ఒక రైతు తనకు చెందిన 99 సెంట్ల పొలాన్ని ప్రభుత్వానికి మార్కెట్ ధరకు ఇవ్వడానికి అంగీకరించడంతో ఆ పొలాన్ని ఆర్‌డీవో పరిశీలించారు. అనంతరం మార్టూరు మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డీవో అధికారులతో సమావేశమై ప్రభుత్వ భూముల వివరాలను తెలుసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సంతమాగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురిజేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ నిర్మల్ కుమార్ తెలిపారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- చిన్న అపశ్రుతి కూడా జరగకూడదు
- సముద్ర స్నానాలకు పక్కా ఏర్పాట్లు చేయాలి
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, ఎక్కడ కూడా చిన్న అపశ్రుతి కూడా జరగకూడదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులకు చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, ముందు జాగ్రత్త చర్యలపై ఆర్డీవో సమీక్షించారు. ప్రాథమికంగా పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, సముద్రంలో లోతు తెలిపే హెచ్చరిక జెండాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, ప్రాథమిక చికిత్స, విద్యుత్ దీపాలు తదితర అంశాలపై చర్చించారు. జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆర్డీవో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పద్ధతులు పాటించాలి

ఏడీ శ్రీనివాసరావు


అలవలపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో సాంకేతిక పద్ధతులు పాటించాలని తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జార్లమూడివారిపాలెం, అలవలపాడు గ్రామాలలో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది. కార్యక్రమంలో పాల్గొని మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. భాస్వరం ఎరువు ఆఖరి దుక్కిలోనే వేయాలని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలను అనుసరించి రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు, ప్రకృతిలో లభించే ఆకులు, అలములతో తయారు చేసుకునే జీవామృతం వంటి కషాయాలు పైరుపై పిచికారీ చేసి తెగుళ్లు, పురుగు నివారించుకోవాలని సూచించారు. రబీలో సాగు చేసిన పంటలకు మీ సేవా కేంద్రంలో లేదా సచివాలయాలలో పంటల బీమా చేయించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది ఫిలిప్, దిల్లీ, ఏఈవో ప్రభాకరరావు, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ : పత్తి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నక్కబొక్కలాడు, మల్లాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతిలో కషాయాలను వాడుకోవాలన్నారు. అనుమతులు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. పీఎం ఫసల్ బీమాను చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

సంతమాగులూరు : రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగులో ఉన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

పర్చూరు : భూసార పరీక్షలు నిర్వహించుకొని సాగుచేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారి రామ్మోహన్ రెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నూతలపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వై.శ్రీకాంత్, రైతు సేవా సిబ్బంది మధుమోహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఈపురుపాలెం ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

చినుకు పడితే చెరువే

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపురుపాలెంలో కొద్దిపాటి వర్షం పడినా ప్రధాన రహదారిలో పలుచోట్ల చెరువులను తలపిస్తూ రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తోంది. వర్షం ఆగాక కూడా ఆ నీరు అలానే నిల్వ ఉంటోంది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడమే అందుకు కారణం. దీంతో వర్షం ఆగిన తరువాత వాహనాలు వేగంగా రాకపోకలు సాగించే సమయంలో ఆ వర్షపునీరు తమపై పడుతోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా కుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చేతులు శుభ్రతతో వ్యాధులు దూరం

మేదరమెట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : చేతులు పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ అక్షిత, డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం కొరిశపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను వరు సందర్శించారు. ఈ సందర్భంగా ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు తెలిపారు. చేతులు ఎలా కడుగుకోవాలో చూపించారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

మేదరమెట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పరిష్కార వేదిక ద్వారా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. మంగళవారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీ వెన్స్ డే కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల ఏడు అర్జీలు అందినట్లు చెప్పారు. ఎక్కువగా భూ సంబంధిత వాటివేనన్నారు. తిమ్మనపాలెం సమీపంలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అండర్ పాస్‌లో ఇల్లు కోల్పోయిన వారికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి కోసం గతంలో స్థలం కేటాయించి వాటిని వినియోగించకపోతే తిరిగి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మండలంలో అటువంటి స్థలాలను గుర్తించి నివేదిక అందించాలని, వీఆరోవకు సూచించారు. అక్రమ లే అ వుట్‌లను గుర్తించి వారికి నోటీసు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

యద్దనపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, శనగ, మినుము పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారి ఎన్.మేరమ్మ రైతులకు సూచించారు.మంగళవారం మండలంలోని పోలూరు గ్రామంలో పొగాకు సాగుచేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఎన్.మేరమ్మ రైతులతో మాట్లాడుతూ పొగాకు సాగు పెరగడం వలన పంటకు ధర తగ్గుతున్నదన్నారు. అంతేగాకుండా పొగాకు వినియోగంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పంట మార్పిడి విధానం వలన అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో తగిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. మండలంలోని చందలూరు, బూదవాడ గ్రామాలలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. చందలూరులో రూ.30లక్షలతో 610 మీటర్ల నిడివిలో బీసీ కాలని, నూజెళ్లపల్లి వెళ్లే రహదారి వైపు, నూతన సచివాలయం ఎదురుగా మూడు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంజూరైన సీసీ రోడ్లను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, మురకొండ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజనులకు అక్షర జ్ఞానం అందించాలి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చదువురాని వయోజనులకు అక్షర జ్ఞానం అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని విద్యాధికారి-2 జి.వీరాంజనేయులు కోరారు. పంగులూరులోని మండల విద్యా వనరుల కేంద్రంలో వయోజన విద్యా కార్యక్రమాల నిర్వహణపై వీవోఏలకు ప్రత్యేక శిక్షణ జరిగింది. మండలంలో 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు గల నిరక్షరాస్యులను 610 మందిగా గుర్తించామని, వారికి వీవోఏలు, డ్వాక్రా గ్రూప్ లీడర్లు స్వచ్ఛందగా రాత్రివేళ అక్షర జ్ఞానం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి ప్రసాద్, సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, వీవోలు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బల్లికురవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళిక తయారు కోసం 15వ తేదీన పంచాయతీ సర్పంచ్‌లకు, సిబ్బందికి బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఒక్క రోజు శిక్షణకు ఏర్పాటు చేశామన్నారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సంతమాగులూరు : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై ఈనెల 14వ తేదీన శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శివరామప్రసాద్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు ఒక్కరోజు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రేపు అద్దంకిలో..

అద్దంకిటౌన్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో ఈ నెల 14వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో బత్తిని సింగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లుతో పాటు అన్ని శాఖల అధికారులు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు నాగరాజు


హెడ్ కానిస్టేబుల్ నాగరాజు

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ బెంగాల్‌లో ఈనెల 15 నుంచి 17 వరకు వరకు జరిగే అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు చీరాల టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.నాగరాజు ఎంపికయ్యారు. న్యూ కూచ్ బీహార్ స్టేడియంలో 40 ప్లస్ విభాగం షాట్‌పుట్, జావెలిన్ త్రో పోటీలలో నాగరాజు తలపడనున్నారు. గతంలో నాగరాజు పలు విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఈక్రమంలో మళ్లీ విజేతగా తిరిగి రావాలని పలువురు పోలీస్ సిబ్బంది ఆకాంక్షించారు.

17న సర్వసభ్య సమావేశం

అద్దంకి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బత్తిని సింగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, శాశ్వత ఆహ్వానితులు, మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని తెలిపారు.

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

సంతమాగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీపీఎస్ స్కూలులో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియో థెరపి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఫిజియోథెరపిస్ట్ ఇందిరాప్రియదర్శిని సహకారంతో దేవరపల్లి శ్రీదర్‌బాబు, స్నేహితులు రూ.12000 విలువైన పరికరాలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో దినేస్‌కుమార్, హెచ్ఎం కె.అనూరాధ, ఉపాధ్యాయులు బాలి, పిలిప్ ఎరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాడరేవుకు చెందిన వివాహిత అదృశ్యంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఆమె కన్పించం లేదని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తి మృతి


గిరి (ఫైల్)

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి వీడియో ఎడిటర్ మృతి చెందారు. ఈఘటన సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. ఈతముక్కలకు చెందిన ఊట్ల గిరి (34) మండల పరిధిలోని రామకృష్ణాపురానికి చెందిన మహేశ్వరిని ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఇతను మ్యారేజీ వీడియో ఎడిటర్ కావడంతో కొంత కాలంగా భార్య పట్టింటి వద్దే ఉంటున్నారు. అయితే స్వగ్రామం వెళ్లేందుకు చీరాలలో రైలు ఎక్కుతూ జారి పట్టాల మధ్య పడపోయాడు. తీవ్రంగా గాయపడిన గిరిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మంగళవారం పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రైవేటు అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్యం మత్తులోనే ఘటన

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన కత్తి భాను ప్రకాష్ ట్రాక్టర్ డ్రైవర్. ఈక్రమంలో వేటపాలెం వైపు ట్రాక్టర్‌పై వెళుతుండగా అక్కాయిపాలెం వద్ద ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ కరిముల్లా మద్యం మత్తులో వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో కిందపడిన భాను శరీరంపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లాయి. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వేటపాలెం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.



కావలిలోని అన్నపుగుంట రైల్వే అండర్ బ్రిడ్జి మార్గంలో వర్షపునీటిలో అవస్థలు పడుతున్న విద్యార్థినిలు

జోరువాన

- జిల్లావ్యాప్తంగా ఎడతెరపిలేని వర్షం
- రోడ్లపై నీరు, రాకపోకలకు ఇక్కట్లు
- పిడుగుపాటుకు 11 గొర్రెల మృతి, గడ్డివామి దగ్ధం
- పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం
- నేడు, రేపు కూడా వర్షాలు కురిసే అవకాశం
- సాగుకు రైతుల సన్నద్ధం
- ఇందుకూరుపేటలో 73.4 మి.మీ అధిక వర్షపాతం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 12: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. మంగళవారం రోజంతా వాన పడుతుండటంతో నెల్లూరు నగరంలో రోడ్లపైకి నీరు వచ్చి చేరింది. గోతులమయంగా ఉన్న రోడ్లన్నీ జలమయమ య్యాయి. ప్రధానరోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో బుధ,గురువారాల్లో కూడా జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే ఎగువన కురిసిన వర్షాలకు జిల్లాలో జలాశయాలన్నీ జలకళను సంతరించుకున్నాయి. కురుస్తున్న వర్షాలతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

సగటు వర్షపాతం 26 మి.మీ

జిల్లాలో మంగళవారం సగటు వర్షపాతం 26 మి.మీగా నమోదైంది. అత్యధికంగా ఇందుకూరుపేటలో 73.4 మి.మీ , అత్యల్పంగా వింజమూరు, మర్రిపాడు,అనంతసాగరంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు. బోగోలు 43.8, అల్లూరు 41.4, బుచ్చి 39.2, దగదర్తి 28.4, కోవూరు 41.6, సంగం 9.4, కొడవలూరు 49.2, విడవలూరు 54.6, సైదాపురం 23.4, నెల్లూరు అర్బన్ 48.6, లింగసముద్రం 7.2, కందుకూరు 30.2, కొండాపురం 6, గుడ్లూరు 12.4, కావలి 50.2, నెల్లూరు రూరల్ 50.4, వెంకటాచలం 72.4, టీపీ గూడూరు 53.5, ఏఎస్‌పేట 8.8, పొదలకూరు 11.2, ఉలవపాడు 15.4, ఆత్మకూరు 14.2, వలేటివారి పాళెం 3.8, జలదంకి 52.4, ముత్తుకూరు 60.2, మనుబోలు 46.8, రాపూరు 8.2, కలువాయి 8.6, చేజర్ల 10.2, కలిగిరి 9.4 మి.మీ వర్షపాతం



కోతకు గురైన టీపీ గూడూరు మండలంలోని కావేపల్లి సముద్రతీరం

నమోదు అయింది.

సంగంలో వీధుల జలమయం

సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరపి లేని వర్షం తో వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. పలు చెరువులోని గుంతలకు స్వల్పంగా నీళ్లు చేరాయి.

ఉదయగిరిలో చిరుజల్లులు

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయగిరి ప్రాంతంలో చిరుజల్లులు కురిశాయి. ఈ కారణంగా గ్రామీణ రహదారులు బురదమయంగా మారాయి.

కుంగిన కల్వర్టు.. తెగిపోయిన రోడ్డు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): చిరుజల్లులకే మండలంలోని అక్కంపేట-కురిచెర్లపాడు

- మిగతా 6లో



కలిగిరి వీధుల్లో నిలిచిన వర్షపునీరు

ఈఎన్‌టీ వైద్యుడి వినూత్న నిరసన

- జీజీహెచ్‌లో నేలపై కూర్చుని రోగులకు వైద్యచికిత్స
- హెచ్‌వోడీ వేధింపులే కారణమన్న డాక్టరు

నెల్లూరు (వైద్యం) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లోని ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సుకుమార్ మంగళవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి తనను వేధింపులకు గురి చేస్తుందంటూ ఆయన ఆరోపించారు. ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో నేలపై కూర్చొని రోగులకు వైద్య చికిత్సలు అందించారు. పైగా మంగళవారం సదరన్ క్యాంపు ఉండటంతో దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందించే ముఖ్యమైన రోజు. దీంతో ఈ ఎన్‌టీ విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, అడ్మినిస్ట్రేషన్ అధికారులు డాక్టర్ కళారాణి, డాక్టర్ సుశీల్ నిరసన తెలుపుతున్న డాక్టర్ సుకుమార్ వద్దకు ఆఘమేఘాలపై చేరుకుని, నిరసన విరమించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ తనను హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి వేధిస్తున్నదన్నారు. ఆమె సక్రమంగా విధులకు రారని, తాను పేదలకు అరుదైన శస్త్రచికిత్సలు చేశానని, అవి పత్రికలలో కూడా వచ్చాయన్నారు. అప్పటి నుంచి తానంటే ఆమెకు అసూయ అని పేర్కొన్నారు. తాను అడ్మిట్ చేసుకున్న కేషీట్‌లో సైతం తన పేరు కొట్టేసి హెచ్‌వోడీ పేరే రాసుకున్నారని ఆరోపించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఈఎన్‌టీ విభాగంలో రెండు యూనిట్లు ఉండగా, ఓ యూనిట్‌కు మార్చేసిందన్నారు. ఈ విషయాలను సూపరింటెం డెంట్ దృష్టికి తీసుకు వెళ్లానన్నారు. అంతేకాక హెచ్ వోడీ ఏడాదిన్నరగా తాను వాడుతున్న రివాల్వింగ్ ఛైర్‌ను తొలగించారని తెలిపారు. ఈ చర్యలకు నిరసనగా ఆందోళన చేపట్టానని వెల్లడించారు. హెచ్ వోడీ చేత వివరణ రాయించుకుంటే తాను నిరసన విరమిస్తానని డాక్టర్ సుకుమార్ తెలిపారు. దీంతో సామరస్యంగా సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలపడంతో ఆయన నిరసన విరమించారు.



నేలపైనే కూర్చుని నిరసన తెలియచేస్తున్న డాక్టర్ సుకుమార్

'నువ్వెంతంటే'.. కథనంపై

అధికారుల సీరియస్

- జరిగిన సంఘటనపై ఆరా

వెంకటాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు అధికారుల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అని మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది.ఈ విషయమై వారు ఆరా తీశారు. గొడవకు కారణమైన మండలస్థాయి రెవెన్యూ అధికారిపై చర్యలు ఉంటాయని కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది, అధికారులు గుసగుసలాడుతున్నారు. గత ఏడాదిగా ఉన్న ఆ అధికారి శైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ మండల స్థాయి రెవెన్యూ అధికారి తన తోటి రెవెన్యూ సిబ్బందిపై కసురు కుంటారని, కార్యాలయానికి పనిమీద వచ్చే ప్రజలు, రైతులపై కూడా దురుసుగా ప్రవర్తిస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులు ఇస్తే ఫైళ్లపై సంతకాలు పెడతారని, లేకుంటే తిరస్కరిస్తారన్న విమర్శలున్నాయి. ఆ అధికారిపై గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో రైతులను దోచుకుని తిన్నాడన్న ఆరోపణాలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం నెల్లూరులో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ పొందటానికి అభ్యర్థులు ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికా రి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొల్లి ప్రసూన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి శిక్షణ మొదలవుతుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలని, టీటీసీ, టెట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ నకళ్లు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న తమ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు అందచేయాలన్నారు. పూర్తి వివరాలకు 9381554779, 9390239588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

- నల్లబజారులో యథేచ్ఛగా ఎరువుల విక్రయం
- మండుతున్న యూరియా, డీఏపీ ధరలు
- ఫలించని సొసైటీల ద్వారా అమ్మకాల యత్నం
- 14 పీఏసీఎస్‌లకు అనుమతించినా ఒకచోటే అందుబాటులో...
- రైతు సేవా కేంద్రాలకు అప్పగిస్తే సమస్యకు పరిష్కారం



అడ్డుకట్ట పడేనా ?

నల్లబజారులో ఎరువుల విక్రయాల నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యూరియా, డీఏపీ బస్తాకు రూ. 100 నుంచి రూ. 150 వరకు అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నెలరోజులుగా ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ సమస్య ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు నిర్దిష్టమైన చర్యలు చేపట్టకపోవటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇదే అదనుగా రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ రెండుచేతులా సంపాదిస్తున్నారు.

6

భర్త చేతిలో భార్య హత్య

- వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఘాతుకం

బిట్రగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యను భర్త హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు విశ్వనాథరావుపేటలో కాపురం ఉంటున్న జలచిత్ర దత్తు అలియాస్ దత్తాత్రేయకు మొదటి భార్య మృతి చెందడంతో తస్లీమా(35) అనే ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. మూడేళ్ల పాటు సజావుగా సాగిన వారి సంసారంలో మనస్పర్థల కారణంగా కలతలు మొదలయ్యాయి. ఈ క్రమంలో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో మంగళవారం ఉదయం ఆమెతో గొడవపడి దత్తు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవపడి కత్తితో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశాడని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కావలి డీఎస్పీ శ్రీధర్, రూరల్ సీఐ పాపారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నిందితుడు దత్తు కోసం దగదర్తి, అల్లూరు ఎస్సైలు జంపానికుమార్, కిశోర్ తమ సిబ్బందితో కలసి గాలిస్తున్నట్లు ఎస్సై బోజ్య తెలిపారు. పోస్టుమార్టం కోసం తస్లీమా మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రక్తపు మడుగులో పడిఉన్న తస్లీమా మృతదేహం (ఇన్‌సర్ట్‌లో), తస్లీమా (ఫైల్)



జల జల పంచలింగాల

సోమశిల అటవీ ప్రాంతం పంచలింగాల కోనలో ప్రవహి స్తున్న జలపాతం భక్తులను కనువిందు చేస్తోంది. కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు అటవీ మార్గాన ఆ క్షేత్రానికి చేరుకుని జలపాతంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)



వంతెనకు మరమ్మతులు మరిచారా ?

విడవలూరు మండలం పార్లపల్లి-చవట పాళెం మధ్య రహదారిపై ఉన్న వంతెన దెబ్బతిని నాలుగేళ్లు అవు తోంది. గత పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2020లో వచ్చిన వరదలకు పంట కాలువపై ఉన్న వంతెన దెబ్బతింది. దీంతో పార్లపల్లికి, చవటపాళెనికి రాక పోకలు స్తంభించాయి. పాలకు లకు, అధికా రులకు మొరపెట్టు కున్నా ఇంతవరకు వంతెన ను మాత్రం బాగు చేయలేదని స్థానికులు పేర్కొన్నారు. దీంతో ప్రతి పనికి చవటపాళెం కాలనీవాసులు కొడవలూరు మీదుగా పార్లపల్లికి రాకపోకలు సాగిస్తున్నారు.

- విడవలూరు (ఆంధ్రజ్యోతి)

ఆయుష్షు తీరిన అంగన్‌వాడీ భవనం

కోవూరు మండలం గంగవరంలో ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. అది ఎప్పుడు కూలుతుందోనని భయపడి, చిన్నారుల తలిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి తమ పిల్లలను పంపడం మానేశారు. దీంతో ఆ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చారు. గంగవరం గ్రామ కూడలిలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రంలో గతంలో యాభై మంది బాలలు చదువుకునేవారు. ఈ భవనాన్ని నేలమట్టం చేసి నూతన భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)





మాయల పకీర్ వేషధారణలో నారాయణ రావు

కళారాధనలో 'నారాయణుడు'


- నాటకాల్లో 'పెరమన' వివిధ పాత్రల పోషణ
- ప్రదర్శనలకే ఆస్తి మొత్తం హారతి కర్పూరం
- మంజూరు కాని కళాకారుల పింఛన్
- వంశపారంపర్య వైద్యమే నేడు జీవనాధారం

ఆయనకు నాటకాలంటే ఎనలేని ప్రాణం.. ఎన్నో పౌరాణిక, సాంఘిక నాటకాల్లో నటించారు. అంతేకాక కళారాధకుడిగా, కళాపోషకుడిగా ఎన్నో నాటకాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ క్రమంలో వారసత్వంగా సంక్రమించిన ఆస్తిపాస్తులను హారతి కర్పూరం చేశారు. నేడు జీవనం కష్టమై పెద్దల నుంచి అబ్బిన ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆయనే పెరమన నారాయణరావు.

సంగం మండలం కోరిమెర్ల గ్రామానికి చెందిన పెరమన నారాయణరావు వెనుకబడిన వర్గానికి చెందినవారు. అయినా ఆయన కుటుంబానికి నాడు గ్రామంలో 33 ఎకరాల మాగాణి, 45 ఎకరాల మెట్ట, తోటలు, భూములు, నెల్లూరులో ఇల్లు, నివాశస్థలాలు, వందలాది గొర్రెలు, మేకలు ఉండేవి. ఈయన తరంలోకి వచ్చేటప్పటికి నాటకాల పిచ్చితో ఆస్తి అంతా హారతి కర్పూరం అయింది. చివరకు వంశపారంపర్యంగా అబ్బిన ఆయుర్వేద వైద్యమే నేడు జీవనాధారం అయింది.

● బాల్యం నుంచి నాటకాలంటే ప్రాణం

నారాయణరావు తాత రామయ్య తోలుబొమ్మలాటలో ఉపయోగించే తోలు బొమ్మలను తయారుచేసేవారు.నారాయణరావు తాత నుంచి కళావారసత్వాన్ని పొందారు. తన తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారిగా బాలనాగమ్మ నాటకంలో బాలవర్ధిగా నటించారు. ఇక ఇక్కడ నుంచి నారాయణరావు కళా ప్రస్థానం ప్రారంభమైంది. 1969లో సురభి కంపెనీలో ఆయన కళాకారుడిగా చేరారు. కొన్నేళ్లపాటు ఆ కంపెనీలో ఉంటూ తన కళా నైపుణ్యానికి మరింత మెరుగులు దిద్దుకొన్నారు. ఆ తరువాత కంపెనీ నుంచి బయటకు వచ్చి పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాల్లో పాత్రలు ధరించారు. నటునిగానే మాత్రమేకాక దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. నారాయణరావు బాలనాగమ్మ, తారాశశాంకం, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణరాయబారం, కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం, మాయాబజార్ నాటకాల్లోని అన్ని పాత్రలను పోషించి రక్తి కట్టించేవారు.



పెరమన నారాయణరావు

● సాంఘిక నాటకాల్లో కూడా నటన

అంతేకాక అల్లూరుసీతారామరాజు, బొబ్బిలియుద్ధం, పల్నాటి యుద్ధం వంటి చారిత్రక నేపథ్యం కలిగిన నాటకాలు, నిప్పురవ్వ, నీతికి స్థానమెక్కడ, కోడినాగు, పల్లెపడుచు, సూరీడు, ఊరమ్మడి బతుకులు వంటి 73 రకాల సాంఘిక నాటికల్లో వివిద పాత్రలు ధరించి ప్రేక్షకుల మెప్పించారు. బండారు రామారావు, రేబాల రమణ, డీవీ సుబ్బారావు, పున్నూరు సుబ్బారావు, ఏ కృష్ణారెడ్డి, పురిణి రఘు రామయ్య, కేవీ కోటేశ్వరరావు, గంగాధరరావు,కే రమణారెడ్డి, గూడూరు సావిత్రి, అర్జునాదేవి, వసంతశోభ, పీ లీలాదేవి వంటి ఉద్ధండపిండాలతో కలసి నారాయణరావు పలు నాటకాలలో తన నటన కౌశల్యాన్ని ప్రదర్శించారు. ఇలా జీవితాన్నే నాటకరంగానికి అంకితం చేశారు.

● ఆస్తులన్నీ పోయాయి...

ఆయనకు 40 ఏళ్ల వచ్చేటప్పటికి కళాప్రస్థానంలో తాతలనాటి ఆస్తులు హారతి కర్పూరం అయ్యాయి. చివరకు నారాయణరావు తన భార్య బిడ్డలతో కలసి కొరిమెర్లలోని చిన్న రేకులింట్లో కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయనకు 65 ఏళ్లు. వంశపారంపర్యంగా అబ్బిన ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు . కళాకారుడిగా తనకు ప్రభుత్వం కాసింత భూమి ఇప్పిస్తే కుటుంబపోషణకు ఇబ్బందులుండవని పలు పర్యాయాలు అధికారులకు విన్నవించుకున్నారు. అయినా ఎవరూ కరుణించలేదు. స్థానిక రాజకీయాలవల్ల కళాకారుల పింఛన్ కూడా మంజూరుకాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు ఆదుకోవాలని నారాయణరావు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



బాలవర్ధి పాత్రలో నారాయణరావు



నెల్లూరు వీఆర్సీ కూడలిలో నిలిచిన వర్షపు



అప్పయ్యకండ్రికలో పిడుగుపాటుకు దగ్ధమవుతున్న గడ్డివాము



కురిచెర్లపాడు సమీపంలో కల్వర్టు కుంగడంతో తెగిపోయిన రోడ్డు

జోరువాన

(5వ పేజీ తరువాయి)

అంతర్గతరోడ్డు మార్గంలో మంగళవారం కల్వర్టు కుంగిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

● విద్యుత్ అంతరాయం

కోవూరు, (ఆంధ్రజ్యోతి): మంగళవారం కోవూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ సరఫరా నిలచిపోయింది. కోవూరులోని ఎన్ఎస్ఆర్ నగర్, పీఆర్ఆర్ కాలనీ, గుమ్మళ్ళదిబ్బల్లోని ప్రధాన వీధుల్లో వర్షపునీరు నిలచిపోయాయి.

రాకపోకలకు ఇక్కట్లు

కావలి, (ఆంధ్రజ్యోతి)వర్షంవస్తే కావలి అన్నపుగుంట మార్గంలో రాకపోకలకు ప్రజలతోపాటు విద్యార్థులకు అవస్థలు తప్పటంలేదు. వర్షం పడితే అన్నపుగుంట నీరంతా ఆ వంతెన ద్వారా వరవకాలువలోకి వెళ్లాల్సి ఉంది. ఆ మార్గంలో వర్షపు నీటితో రాక పోకలు స్తంభించాయి. సైకిళ్ల ఉన్నవారు మోకాటి లోతు నీళ్లలోనే ఇద్దరు ముగ్గురు కలిసి సైకిళ్లు నెట్టుకుని వెళ్లగా, సైకిళ్ల లేనివారు ప్రమాదపు టంచున రైల్వేట్రాక్ ఎక్కి దాటుకుని వెళ్లారు.

● చెరువులకు జలకళ

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): కుండపోతగా వర్షానికి మండలంలోని చెరువులు, పొలాలు, గుంటలు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. రైతులు వరినాట్ల కోసం దుక్కులు చేసుకుంటున్నారు

● ముత్తుకూరులో ఆగని వర్షం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : మంగళవారం ముత్తుకూరులో జోరుగా వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడడంతో ముత్తుకూరులో విద్యుత్ సరఫరా తీవ్ర అంతరాయం ఏర్పడింది.

● వరికయ్యల్లో నిలిచిన నీరు

జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఉదయాన్నే రైతులు వ్యవసాయపనుల కోసం పొలాల్లోకి పరుగులు తీశారు. రైతులు నారుమళ్లకు ఎరువులు చల్లుతూ, క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు.

● ఎగసిపడుతున్న అలలు

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. దీంతో ప్రభుత్వాసుపత్రి వర్షపునీటితో నిండిపోయింది.అలాగే సముద్రంలో అలలు ఎగసి పడుతూ ఉన్నాయి. దీంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లేందుకు సాహసించలేదు.

● రైతుల హర్షం

చిట్టగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి సరిపడినంత సాగునీరు లేవని బాదపడుతున్న వారికి ఈ వానలు ఊరట కలిగించాయి.

● వీధులు జలమయం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులన్నీ సరిగా లేకపోవడం, డ్రైనేజీలు పూడిపోయి ఉండటంతో కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ జలమయ మయ్యాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వర్షపునీరు పోయే మార్గాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● అప్పయ్యకండ్రికలో పిడుగుపాటు

నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పయ్యకండ్రికలో సోమవారం అర్ధరాత్రి పిగుడుపడింది. దీంతో బడుగు వెంకటేశ్వర్లుకు చెందిన 15 ఎకరాల వరిగడ్డివామి దగ్ధమైంది.

● పొగాకుకు జీవం పోసిన వర్షం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం కురిసిన వర్షం పొగాకు పంటకు జీవం పోసింది. ఎండుముఖం పట్టిన పొగాకు వర్షానికి కళకళలాడుతున్నాయి.



కొత్తసత్రంలో పిడుగుపాటుకు 11 గొర్రెల మృతి

- నాలుగు జీవాలకు గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కావలి రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రంలో మంగళవారం పిడుగుపాటుకు గురై 11 జీవాలు(గొర్రెలు) మృతి చెందగా, 4 జీవాలు గాయపడ్డాయి. గ్రామస్థుల కథనం మేరకు, గ్రామానికి సమీపంలోని పొలాల్లో నక్కా శ్రీకాంత్ జీవాలు మేపుతుండగా వర్షం పడుతుండటంతో కొన్ని జీవాలు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాయి. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగుపడింది. చెట్టుకు కొంతదూరంలో ఉన్న శ్రీకాంత్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ ప్రమాదంలో 11 గొర్రెలు చనిపోగా, నాలుగు గొర్రెలు గాయప డ్డాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నరేంద్ర ప్రమాద విషయాన్ని ఎంపీడీవో శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సంఘటనా స్థలంలో పడిఉన్న జీవాల మృతదేహాలను పరిశీలించి పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. జీవాల మృతితో రూ. 2.5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకుని పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.



అడ్డుకట్ట పడేనా ?

కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగుతున్నాయి. ఓ వైపు మిరపనాట్లు పూర్తయి ఎరువులు ఎదబెడతుండగా, పొగాకు, పప్పుశనగ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ఎరువులు ఎదబెట్టి భూములను సిద్ధం చేస్తున్నారు. ఈ దశలో ఎరువుల కొరత వారిని తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఎరువుల కొరత లేకుండా చేస్తారని ఆశించిన రైతులకు తీవ్రనిరాశే మిగిలింది. జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లు రైతుల కష్టం వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● పీఏసీఎస్‌ల్లో మొక్కుబడిగానే..

ఎరువుల సరఫరాలో ఇబ్బందులు ఉన్న దృష్ట్యా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నెల క్రితం అధికారులు ప్రకటించారు. అయితే ఆచరణలో మాత్రం చేతులెత్తేశారు. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 14 పీఏసీఎస్‌ల ద్వారా ఎమ్మార్పీకే ఎరువులు అందుబాటులో ఉంచనున్నామని, రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సిన అవసరం రాదని అధికారులు ప్రకటిం చారు. ఈ మేరకు ఆగస్టు చివరి, సెప్టెంబరు మొదటి వారంలో ఆయా పీఏసీఎస్‌లకు ఎరువుల లైసెన్సులు కూడా మంజూరు చేశారు. అయితే రెండునెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క పీఏసీఎస్‌లో కూడా ఎరువుల విక్రయాలు ప్రారంభం కాలేదు. జిల్లావ్యాప్తంగా వందకుపైగా పీఏసీఎస్‌ల ద్వారా ఎరువుల విక్రయాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధికారులు ప్రకటిం చినా ఆచరణలో కార్యరూ పం దాల్చలేదు. బడేవారిపాలెం పీఏసీఎస్‌లో మాత్రమే రైతులకు ఎరువులు అందిస్తుండగా, మిగిలిన 13 పీఏసీఎస్‌ల్లో ఆ ప్రయత్నమే జరగలేదు. దీంతో రైతుల అవసరాన్ని ప్రైవేటు డీలర్లు సొమ్ముచేసు కుంటున్నారు.

● రైతు సేవా కేంద్రాల సేవలు ఏవీ?

గ్రామ గ్రామాన రైతు సేవాకేంద్రాలతోపాటు ఎరువుల గోదాములు కూడా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచితే రైతులకు మేలు జరగడంతోపాటు ధరలు కూడా నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే పీఏసీఎస్‌ల పేరుతో కాలయాపన చేస్తుండటంపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అటు రైతు సేవా కేంద్రాలలోనో ఇటు పీఏసీఎస్‌లలోనూ ఎరువులను అందుబాటులోకి తీసుకురాకుండా ప్రైవేటు వ్యాపారులకే వదిలేయడంపై మతలబు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

● ఆదేశాలన్నీ కాగితాల్లోనే..

ఎరువుల ధరల నియంత్రణకు, రైతులకు అందుబాటులో ఉండేలా చూడటం కోసం ప్రతి సబ్ డివిజన్‌కు ఓ ప్రత్యేక అధికారిని వ్యవసాయ శాఖ నియమించింది. కందుకూరు సబ్ డివిజన్‌కు ఎరువుల విజిలెన్స్ అధికారిగా కావలి ఏడీఏని నియమించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటుచేయటంతోపాటు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఎరువుల సరఫరా కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇవన్నీ కాగితాలకే పరిమితం కావటంతో రైతులకు ఏమాత్రం మేలుజరగడం లేదు. జిల్లా కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్య యనం చేసి, ఇటు రైతు సేవాకేంద్రాల ద్వారా కానీ అటు పీఏసీఎస్‌ల ద్వారా కానీ రైతులకు అన్నీ రకాల ఎరువులు ఎమ్మార్పీకే లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భగ్గుమంటున్న ధరలు

యూరియా 45 కిలోల బస్తా రూ. 266లకు రైతులకు అందజేయాల్సి ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ. 350 నుంచి రూ. 380 వరకు వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.350కి విక్రయిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా ఛార్జీలు, ఇతరత్రా పేరుతో రూ. 380 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో సరాసరిన రైతులు బస్తా యూరియాకు రూ. 100 అదనంగా చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే డీఏపీ 50 కిలోల బస్తా రూ. 1350కి విక్రయించాల్సి ఉండగా, రూ. 1450 నుంచి రూ. 1480 వరకు వసూలు చేస్తున్నారు. రైతులు ఇష్టపడే గోదావరి డీఏపీ కావాలంటే రూ. 1530 చెల్లిస్తేనే ఆ రకం డీఏపీని ప్రైవేటు వ్యాపారులు రైతులకు ఇస్తున్నారు. ఏ కంపెనీ డీఏపీ అయినా ఒకే ధరకు విక్రయించాల్సి ఉన్నా రైతులు కోరుకునే డీఏపీ కాబట్టి గోదావరి డీఏపీకి మరింత ధర వసూలు చేస్తున్నారు. పోనీ సొసైటీల్లో తీసుకుందామా అంటే ఒక్క బడేవారిపాలెం సొసైటీలో మినహా ఎక్కడా అందుబాటులో లేవు. అక్కడ కూడా లారీ వస్తే గంటలోపే అయిపోతుండటంతో రైతులకు సక్రమంగా అందటం లేదు. ఇక మిగిలిన కాంప్లెక్స్ ఎరువులు కొంతవరకు అందుబాటు ధరలోనే లభ్యమవుతున్నట్లు సమాచారం.

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

● అడిషనల్ డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలీ సూచించారు. మంగళవారం గండిపాళెం, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గళ్ల పరీక్ష నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, అయూబ్, సీహెచ్‌వోలు శివకుమారి, ఓంకారయ్య, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, ఖాజామొహిద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ సర్వేపై అవగాహన

● సీతారామపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం కేన్సర్ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కావలి అడిషనల్ డిఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి పాల్గొని మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సి కేన్సర్ స్క్రీనింగ్ ఇంటింటి సర్వే మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, సూపర్‌వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, హెల్త్ అసిస్టెంట్స్ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలల్లో ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పూర్తి

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పనులు ఆరు నెలల్లో పూర్తిచేయనున్నట్లు ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆనకట్ట ఆధునికీకరణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతోపాటు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కె.చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు

ఉదయగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు సంబంధించిన ఆస్తులను అక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎస్ వెంకటరావు, ఎస్‌ఐ కె ఇంద్రసేనారెడ్డిలు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల పాత పోలీసు క్వార్టర్స్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వార్టర్స్ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు రమణయ్యకు నేతల నివాళి

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, సీనియర్ నాయకుడు తాళ్లూరు రమణయ్యనాయుడు పార్థివదేహాన్ని మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, వైసీపీ జిల్లా నేత ఆనం విజయకుమార్‌రెడ్డిలు వేర్వేరుగా సందర్శించి పూలమాలు వేసి నివాళులర్పించారు. వారి వెంట తడకలూరు, కాట్రాయిపాడు, చవటపుత్తేడు, చెన్నూరు సర్పంచులు గిరినాయుడు, ప్రసాద్, శీనయ్య నాయక్ ఉన్నారు.


ఆర్ఎస్ఆర్‌లో న్యూస్ లెటర్ ప్రారంభం

బిట్రగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈ ఎక్స్‌పీరియా పేరుతో న్యూస్ లెటర్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ప్రారంభించారు.

శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు

● పల్లెలకు అందని రక్షితనీరు ● పొంచి ఉన్న వ్యాధులు

ఆత్మకూరు, నవంబరు 12: ఇటీవల వర్షాలు కురిసి తాగునీరు కలుషితం కావడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను కేవలం ఐదారు గ్రామాల్లో మాత్రమే నీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నిధుల కొరత వెంటాడుతుండంతో పాటు పలు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులకు నిచ్చెనలు లేకపోవడంతో శుభ్రతకు నోచుకోవడం లేదు. నెలలో రెండు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. బ్లీచింగ్, సున్నంతో శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి. మైనర్ పంచాయతీల్లో ఒక్కొక్క ట్యాంకును ఒక్కసారి శుభ్రం చేసేందుకు రూ.500 నుంచి రూ.1000, మేజర్ పంచాయతీల్లో రూ.1000 నుంచి రూ.1500 వరకు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి వాటర్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. దాంతో కలుషితనీరు సరఫరా కావడంతో పలు రోగాలు ప్రబలుతున్నాయని, ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్ ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


శుభ్రతకు నోచుకోని వాటర్‌ట్యాంకు

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

● ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, అధికారులకు మండల, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ పంచాయతీ ఆర్థిక వనరుల్లో ముఖ్యంగా 15వ ఆర్థికసంఘ నిధులను నిబంధనల మేరకు పారిశుధ్యం, తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగించాలని తెలిపారు. అనంతరం ఈవోపీఆర్డీ వి డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు ఎస్ కార్తీక్, చిన్న మస్తాన్, డిజిటల్ అసిస్టెంట్ కె వేణు టీవీటీలుగా వ్యవహరించి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి ప్రణాళికలపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల అభివృద్ధికి తీసు కోవాల్సిన ప్రణాళికలపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం జరిగింద న్నారు. తొలుత మహాత్మాగాంధీ, బీ ఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, సర్పంచులు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, పావులూరి సామ్రాజ్యం, వెంకటస్వామి, తిరుపతయ్య, ఎంపీటీసీలు పెదమస్తానీ, కాకు విజయమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కొండాపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కార్యదర్శులు, సర్పంచులకు ఎంపీడీవో ఆదినారయణరావు సూచించారు. మంగళవారం ఆయన సాయిపేట, భీమవరప్పాడు, నేకునాంపేట, రేణమాల, పార్లపల్లి, సత్యవోలు, కొమ్మి, గానుగపెంట, శెట్టిపాలెం సర్పంచులతో సమావేశం అయ్యారు. సీసీరోడ్లు, వీధిలైట్లు, డ్రేనేజి మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో శేషసాయి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

● వరికుంటపాడు : స్థానిక మండల పరిషత్, స్త్రీశక్తి భవన కార్యాలయాల్లో బుధవారం పంచాయతీ, మండల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, డిజిటల్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యం


వరికుంటపాడు: పొలాలను పరిశీలిస్తున్న ఏవో రవికుమార్

వరికుంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరి నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రవి కుమార్ అన్నారు. మంగళవారం జడదేవి, గువ్వాడి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి సాగు చేపట్టబోయే పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. రైతులు డిసెంబరు 15వ తేదీలోపు పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పవన్‌కుమార్, ఆదిత్య, పాల్గొన్నారు.

● అల్లూరు: రబీ సీజనులో చేపట్టే వ్యవసాయ సాగులో ఎరువుల యాజమాన్యం కీలకమని దీనిపైనే దిగుబడి, నాణ్యత ఆధారపడి ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి శైలజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణ అత్యంత కీలకమైన ప్రక్రియలని వీటిని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎరువులను విచ్చలవిడిగా వినియోగించి తెగుళ్లను కొని తెచ్చుకునే పరిస్థితి లేకుండా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీహరి నారాయణ పాల్గొన్నారు.

● బిట్రగుంట : బోగోలు మండలం ముంగమూరు, ఏనుగులబావిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి మధురిమ పాల్గొన్నారు. యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధి, ఎరువులు, నీటి యాజమాన్యం, నానో యూరియా, డీఏపీల గురించి వివరించారు.

ఆయకట్టు చివరి పొలాలకు నీరందిస్తాం

● ఎమ్మెల్యే ఇంటూరి


తూము ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ఆయకట్టు చివరి పొలానికి కూడా ఈసీజన్‌లో నీరందిస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్ద అధికారులు, రైతులతో కలిసి గంగమ్మకు జలపూజ చేసి చీర సారె సమర్పించి కుడి, ఎడమ కాలువల తూముఎత్తి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ సోమశిల నుండి 1.50 టిఎంసీల నీరు ప్రాజెక్టుకు వస్తుందని, వరి పంటకు నీటి సమస్య ఉండదన్నారు. కుడి కాలువ నుండి 15క్యూసెక్కులు, ఎడమ కాలువ నుండి 5క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్టు డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఒంగోలు సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మి, డీఈ మధుసూదనరావు, ఎఈ చంద్రమౌళి, టీడీపీ నాయకులు మద్దాల రామారావు, అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్, కేశినేని నాగేశ్వరరావు, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఇంటూరి

● కందుకూరు: నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియ వీలైనంత త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా శాసన సభ్యులు, ముఖ్యనేతలతో కలిసి మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలిపే అంశంతోపాటు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నిబంధనల మేరకు పక్కాగృహాల నిర్మాణం చేపట్టాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చింతలకుంట, దుత్తలూరు గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సబ్ డివిజన్ డీఈ పీరాన్, ఏఈ యప్రాయం, వర్కుఇన్‌స్పెక్టర్ పోలయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ఆరా

కావలి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక 36వ వార్డు చెరువుకట్ట గిరిజన సంఘంలో మంగళవారం సీపీఎం మండల నేతలు పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో దళితులు మైనార్టీలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డునిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండా యపాళెం మాసాయిపేట గ్రామంలో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత గుత్తేదారులకు సూచించారు. ఈ కార్య క్రమంలో ఏఈ శ్రీనివాసరాజు, టీడీపీ నాయకుడు తుమ్మల కిరణ్ పాల్గొన్నారు.

●వరికుంటపాడు: నల్లబోతులవారిపల్లిలో అంతర్గత రహదారులను డీఈ మణికుమార్ మంగళవారం పరిశీలించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలన్నారు. అలాగే కాంచెరువులో జరుగుతున్న రహదారి పనులను ఏఈఈ రవీంద్రనాథ్ పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణయ్య, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్ల సహకారంతో ఎస్సార్‌నగర్ అభివృద్ధి

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో సంజీవరెడ్డి నగర్ కాలనీ మరింత అభివృద్ధి చెందుతోందని టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు రూ. 15 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

సాదాసీదాగా లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మార్చి 12 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాలకొండరాయునిపాలెం పంచాయతీ ముక్తేశ్వరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని ఎంపీటీసీ సభ్యుడు కోరారు. ఆర్ఆర్ పాలెంలో పగిలిన మంచినీటి పైపును మరమ్మతు చేయించాలని సర్పంచు చింతగుంపల అంజమ్మ కోరారు. జలజీవన్ మిషన్ ద్వారా చినపవని జగనన్న లేఅవుట్‌లో కూడా పైపులైన్ వేయించాలని సర్పంచు దామా సీతారామయ్య కోరారు. సమావేశానికి కొందరు అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● జీ రాజేశ్వరరావు, కావలి రూరల్ సీఐ



కావలిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు తెలిపారు.

ఈ ముఖాముఖి

? గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఏ చర్యలు చేపట్టారు.

! గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల కూడళ్లలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం.

? నేరాలు, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలేంటి.

! పాఠశాలలు, కళాశాలలను సందర్శించి మహిళాచట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

? రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ముందుగా జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాం. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్‌జాగ్ పద్ధతిలో బారికేడ్లు ఏర్పాటుచేస్తూ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

న్యూస్ బాక్స్

భూసమస్యలపై గ్రామసభ

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం మంగళవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని పాల్గొని రైతుల నుంచి అర్జీలను పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. సింగారెడ్డిపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, సర్పంచ్ దుర్గం సంపూర్ణ, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లింక్‌కు ప్రత్యేక శిబిరాలు

కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ లింక్, కొత్త ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు ఈ నెల 15 వరకు ప్రత్యేక పోస్టల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు కందుకూరు అసిస్టెంట్ సూపరింటెండ్ ఆఫ్ పోస్టాఫీస్ సీహెచ్ మారుతి మధువాణి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో లభించే సంక్షేమ పథకాల బెనిఫిట్స్ లబ్ధిదారుల ఖాతాలలోకి నేరుగా జమ అవుతాయన్నారు. కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని 100 తపాలా బ్రాంచ్ కార్యాలయాలు, సబ్ పోస్టు ఆఫీసులు, హెడ్ పోస్ట్ ఆఫీసుల ద్వారా ఆయా పట్టణ, గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా ఇదివరకే ఉన్న ఖాతాలతో పాటు కొత్తగా ఖాతాలు తెరిచి ఆధార్‌లింక్ చేస్తామన్నారు.

దేశానికి వ్యవసాయ రంగం కీలకం

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశానికి వ్యవసాయ రంగం ఎంతో కీలకం అని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు దీక్షారంభ్-2024 కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజికంగా, మానసికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టీ గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, జీ రమేష్, శోభ, అశోక్, హరీష్, క్రాంతి పాల్గొన్నారు.

ఆదినారాయణరెడ్డికి ఘన నివాళి

అల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి ఆదినారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని స్థానిక విష్ణు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంత రాజు బాలకృష్ణంరాజు, పప్పు సుధాకర్, పాపాల ప్రభాకర్‌రెడ్డి, సురేష్,పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కన్వీనర్‌గా మురారిశెట్టి సుధీర్

కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల కన్వీనర్‌గా మురారిశెట్టి సుధీర్‌కుమార్‌ను నియమించినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాలోని ఆర్యవైశ్య మండల అధ్యక్షుల పదవీకాలం ముగియడంతో నూతన అధ్యక్షుల ఎన్నిక జరిగే వరకు జిల్లా యువజన సంఘం ఉపాధ్యక్షులుగా విధులు నిర్వహిస్తున్న సుధీర్‌కుమార్‌ను కన్వీనర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా తటవర్తి వాసు

కావలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టరుగా పట్టణానికి చెందిన తటవర్తి వాసు నియమితులయ్యారు.ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సిఫార్సుల మేరకు ఆయనకు డైరెక్టర్ పదవి లభించింది. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు.